


ఈ ఐదేళ్లలో టీడీపీ కార్యకర్తలపై నిర్బంధాలు ప్రయోగించారు. అయినా బెదిరిపోకుండా చంద్రబాబుకు మీరంతా అండగా ఉన్నారంటే దానికి కారణం నమ్మకం. ఈ ఎన్నికలు కురుక్షేత్ర పోరాటం, స్వాతంత్ర్య పోరాటం లాంటివి. ధైర్యంగా ఉండాలి. నిజం గెలవాలి. నిర్బంధాల వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలి. - భువనేశ్వరి



ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న నారా భువనేశ్వరి



అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శనిలా తయారైంది అధికార వైసీపీ అభ్యర్థుల పరిస్థితి. ముందే డబ్బు భారీగా ముట్టింది.. ఇక ఎన్నికలు రావడం.. డబ్బు పంచేయడం.. గెలిచేయడమే తరువాయి.. అంటూ పగటి కలలు కన్న వారిపై ఎన్నికల సంఘం నీళ్లు చల్లింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వారానికే నోటిఫికేషన్ వచ్చి, నెల రోజుల్లో పోలింగ్ ప్రక్రియను ముగించేస్తారని భావించిన వైసీపీ నేతలు సుమారు 2 నెలలు సాగే ఎన్నికల షెడ్యూల్‌ను చూసి షాక్ అయ్యారు. షెడ్యూల్‌కు ముందే రెండు జిల్లాల్లోని వైసీపీ అభ్యర్థులకు రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్ల చొప్పున అందడంతో డబ్బుపెట్టి గెలిచేద్దామనుకున్న వారు ఇప్పుడు రెండు నెలలు సాగే ఎన్నికల ప్రక్రియతో పాటు ఖర్చు కూడా మరో రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకూ పెరిగే అవకాశం ఉండటంతో ఏం చేయాలో తెలియని సందిగ్ధంలో లోలోపల మదనపడిపోతున్నారు.

- విజయవాడ ఆంధ్రజ్యోతి

ఇప్పటికే రూ.కోట్లలో అందిన సొమ్ము

లబ్‌డబ్బు

వైసీపీ అభ్యర్థుల గుండెల్లో ఎన్నికల గుబులు

ఎన్నికల తేదీ పెరగడంతో సరిపోని నిధులు

- ఇప్పటికే పలువురికి కానుకలు, కాసుల పంపిణీ
- మిగిలిన సొమ్ము నాయకులు, కార్యకర్తలకే సరి
- ఓట్ల కోసం జేబులో డబ్బు తీయక తప్పని పరిస్థితి
- ఏం చేయాలో తెలియక సతమతం

ఖర్చు తడిసి మోపెడు

కోడ్ అమల్లోకి వచ్చాక తమ పంపకాల తంతు సాగదని భావించిన వైసీపీ అభ్యర్థులు షెడ్యూల్ రాక ముందే వలంటీర్లు, ఆశా వర్కర్లు, డ్వాక్రా సంఘాలు, యానిమేటర్లు ఇలా క్షేత్రస్థాయిలో పనిచేసే చిరుద్యోగులందరితోనూ సమావేశాలు ఏర్పాటు చేసి, భోజనాలు పెట్టి కానుకలు, కాసులు పంచేశారు. వారి ద్వారా ఓటర్లను ప్రభావితం చేయవచ్చన్నది వైసీపీ అభ్యర్థుల భావన. ముందస్తుగా వచ్చిన డబ్బుల్లో కొంత మొత్తంతో ఈ పందేరాలు చేసి మిగిలిన డబ్బుతో ఎన్నికల్లో గట్టెక్కేయాలని భావించారు. కానీ, పరిస్థితి తారుమారైంది. చాలా మంది అభ్యర్థులు నియోజకవర్గాల్లో కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయ నిర్వహణ, రోజువారీ ప్రచారానికి వచ్చేవారికి భోజనాలు, మందు, ఇతర ఖర్చులు.. ఇలా ఎంత లేదన్నా ఒక్కో అభ్యర్థికి రోజుకు రూ.10 లక్షల పైచిలుకు ఖర్చవుతోంది. దీనికి తోడు ఊహించని విధంగా గ్రామ, మండల స్థాయి నాయకుల బ్లాక్‌మెయిల్ తాకిడి ఎక్కువైంది. ఇటీవల పెనమలూరు నియోజకవర్గంలో జరిగిన సంఘటనే దీనికి ఉదాహరణ. నియోజకవర్గానికి చెందిన ఓ గ్రామస్థాయి నాయకుడు గ్రామంలో అధికశాతం ఉన్న ఓ సామాజికవర్గం ప్రతిపక్ష పార్టీ నాయకుడికి టచ్‌లోకి వెళ్లిందని, వెంటనే వారిని మచ్చిక చేసుకోకపోతే మన గెలుపుపై ప్రభావం చూపే అవకాశం ఉందని చెప్పి అదే సామాజికవర్గానికి చెందిన నాయకుడికి సుమారు రూ.10 లక్షలు ఇప్పించారు. ఇలాంటి ఘటనలు దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ జరుగుతున్నాయి. అధికారంలో ఉన్న ఈ ఐదేళ్లలో ఎమ్మెల్యే, ఆయన చుట్టుపక్కల ఉన్న నలుగురైదుగురు తప్ప గ్రామ, మండలస్థాయి నాయకులెవరూ పెద్దగా సంపాదించుకున్నది లేదు. దీంతో ఈ ఎన్నికల్లో ఎలాగైనా కాసులు కూడబెట్టుకోవాలన్న ఆలోచనలో వారంతా ఉన్నారు. ఏదో ఒక రకంగా అభ్యర్థిని బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు గుంజుతున్నారు.

ఇంటి దొంగలతో బెంబేలు

వైసీపీ అభ్యర్థులను ఇంటి దొంగల బెడద వెంటాడుతోంది. మైలవరం నియోజకవర్గ పరిశీలకుడిగా ఉన్న వ్యక్తిని ఇటీవల మార్చేసి వేరే వారిని నియమించారు. ఈ మార్పు వెనుక పెద్ద కథే నడిచిందని చెబుతున్నారు. మైలవరం నియోజకవర్గానికి తొలి విడతగా రూ.12 కోట్ల నగదును పంపారు. ఈ మొత్తంలో రూ.6 కోట్ల వరకు వలంటీర్లు, మహిళా సంఘాలు, ఇతరులకు కానుకలు, కాసుల పంపిణీకి వినియోగించారు. ఈ మొత్తం ఖర్చు పాత పరిశీలకుడి కనుసన్నల్లో నడిచింది. ఆ మొత్తంలో సుమారు రూ.2 కోట్ల వరకు గోల్‌మాల్ జరిగిందని వైసీపీ పెద్దలు లెక్కలు తేల్చారు. దీంతో ఆగమేఘాలపై పరిశీలకుడిని మార్చేసి కొత్త వ్యక్తిని నియమించారు. ఇప్పుడు ఈయన్ను కూడా మార్చేసి మూడో కృష్ణుడిని రంగంలోకి తీసుకురా నున్నట్లు సమాచారం. పార్టీ నుంచి వచ్చిన డబ్బుతో పాటు తమ సొంత డబ్బును పోలింగ్ తేదీ వరకు భద్రపర్చడం వైసీపీ అభ్యర్థులకు పెద్ద పనిగా తయారైంది. అధికారికంగా పార్లమెంట్ అభ్యర్థి రూ.90 లక్షల వరకు, అసెంబ్లీ అభ్యర్థి రూ.40 లక్షల వరకు ఖర్చు చేసే అవకాశం ఉంది. కానీ, పార్లమెంట్ అభ్యర్థి తక్కువలో తక్కువ రూ.100 కోట్ల పైచిలుకు ఖర్చు చేసే పరిస్థితి ఏర్పడింది. ఇక అసెంబ్లీ అభ్యర్థికి కనీసం రూ.50 కోట్ల పైచిలుకు ఖర్చవుతుంది. ఐదేళ్లు దోచుకున్న సొమ్ముతో వైసీపీ అభ్యర్థులు ఈ ఖర్చును మరింత పెంచేస్తున్నారు. ఎలాగైనా గెలవాలన్న లక్ష్యంతో అడ్డగోలుగా డబ్బు పంపిణీకి తెగబడుతున్నారు. వైసీపీ అడ్డగోలుగా చేసే డబ్బు పంపిణీని నిలువరించడతో పాటు ఎన్నికల అక్రమాలను అడ్డుకోవాలన్న ఉద్దేశంతోనే బీజేపీతో టీడీపీ చేతులు కలిపిందన్నది ఆ పార్టీ నాయకుల మాట. ఓవైపు ఇంటి దొంగల బెడద, మరోవైపు ఎన్నికల అధికారుల వేటలో ఎక్కడ దొరికిపోతామోనన్న ఆందోళన వారిని వెంటాడుతోంది.

కోడ్ కష్టాలతో..

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మంత్రులు, ఎమ్మెల్యేలకు ప్రొటోకాల్ లేకుండాపోయింది. దీంతో అప్పటి వరకు సమావేశాలు, భోజనాలు అంటూ అధికారులను పీక్కుతిన్న వీరికి ఇప్పుడు దిక్కుతోచడం లేదు. ముఖ్యంగా మచిలీపట్నం, పెడన, పెనమలూరు, గుడివాడ, నందిగామ, విజయవాడ సెంట్రల్‌లో పోటీ చేస్తున్న అభ్యర్థులు కోడ్ అమల్లోకి వచ్చే వరకు ఇష్టారాజ్యంగా ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేసి తమ ప్రచారానికి వాడుకున్నారు. మాజీ మంత్రి, సిటింగ్ ఎమ్మెల్యే పేర్ని నాని తనయుడు కిట్టు ప్రచార ఖర్చంతా సర్కారు ఖాతాలో నుంచో లేకపోతే అధికారుల జేబుల నుంచో భరించాల్సి వచ్చింది. పెనమలూరులోనూ అదే పరిస్థితి. జోగి రమేశ్ మంత్రిగా ఉండటంతో ఆయన నియోజకవర్గంలో విపరీతమైన అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. ఎన్నికల కోడ్ వచ్చే వరకు ప్రభుత్వ సొమ్ముతో ప్రచారం చేసుకున్న మంత్రి జోగి రమేశ్ బాధ ప్రస్తుతం వర్ణణాతీతంగా ఉంది. గతంలో వలంటీర్లతోను, ఆశా వర్కర్లతోను, మహిళా సంఘాలతోను సమావేశాలు ఏర్పాటు చేసి భోజనం ఖర్చును వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీపై మోపేవారు. ఇప్పుడు జేబులో డబ్బు తీయాల్సి వచ్చేసరికి సమావేశాల జోరు తగ్గించారు. పెడనలోనూ అదే పరిస్థితి. ఇక్కడ వైసీపీ అభ్యర్థిగా ఉన్న ఉప్పాల రాము సతీమణి జడ్పీ చైర్‌పర్సన్‌గా ఉండటంతో దాన్ని సాకుగా తీసుకుని ఆయన కోడ్ వచ్చే వరకు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. సతీమణి ప్రొటోకాల్‌ను అడ్డుపెట్టుకుని అధికార మందీమార్బలంతో అట్టహాసంగా ప్రచారం నిర్వహించారు. కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఆయనకీ కష్టాలు మొదలయ్యాయి. విజయవాడ సెంట్రల్ నుంచి బరిలో ఉన్న వెలంపల్లి శ్రీనివాసరావు తన ప్రచారానికి వీఎంసీ అధికారులను, వలంటీర్లను తెగ వాడేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఇప్పుడు జేబులో డబ్బు తీసి మరీ జనాలను తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మేయర్ భాగ్యలక్ష్మి ప్రొటోకాల్‌ను వాడుకుని అడ్డగోలు వ్యవహారాలకు తెరతీశారు. తన కార్యాలయానికి రాత్రికి రాత్రి రోడ్డు వేయించుకున్న ఘనత ఈయనది.

వైసీపీ రాక్షస పాలనకు చరమగీతం పాడాలి

'నిజం గెలవాలి' యాత్రలో నారా భువనేశ్వరి పిలుపు

బిళ్లనపల్లిలో మహిళలు, రైతుల నీరాజనం

హనుమాన్‌జంక్షన్/హనుమాన్‌జంక్షన్ రూరల్, మార్చి 27 : ఈ ఐదేళ్లలో నోరెత్తితే నిర్బంధాలు, ప్రశ్నిస్తే జైలుకు పంపడాలు వైసీపీ ఘనత అని, ఇటువంటి రాక్షస పాలనకు ఈ ఎన్నికల్లో చరమగీతం పాడాలని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. అన్నదాతలకు, ప్రజలకు నీరందాలని పోలవరం ప్రాజెక్టు 72 శాతం పూర్తి చేసిన ఘనత టీడీపీదేనన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మరణించినవారి కుటుంబాలను పరామర్శించేందుకు ఆమె చేపట్టిన 'నిజం గెలవాలి' యాత్ర బుధవారం బాపులపాడు మండలం బిళ్లనపల్లికి చేరింది. గ్రామంలోని రెండు కుటుంబాలను ఆమె పరామర్శించారు. రాత్రి 8 గంటలకు గ్రామానికి చేరుకున్న భువనేశ్వరిని చూసేందుకు మహిళలు, రైతులు పెద్దఎత్తున గ్రామానికి చేరారు. భువనేశ్వరి మాట్లాడుతూ టీడీపీపై అభిమానం, చంద్రబాబునాయుడుపై ఉన్న గౌరవంతో రాత్రి అయినా నాకోసం ఎదురుచూడటం పార్టీపై మీకున్న అభిమానాన్ని చాటుతోందన్నారు. పేదలకు అన్నం పెట్టేందుకు చంద్రబాబునాయుడు అన్న క్యాంటీన్లు స్థాపించి కోట్లాది మంది కడుపు నింపారన్నారు. విజన్ 2020 పేరుతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైటెక్ సిటీ తెచ్చి లక్షలాది మంది యువతకు ఉపాధి చూపించిన ఘనత చంద్రబాబుదన్నారు. ఆయన మీద నమ్మకంతో అనేక పెద్దపెద్ద పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చాయన్నారు. విభజన తరువాత మరో ఐదేళ్లు చంద్రబాబుకు ప్రజలు అధికారం ఇచ్చి ఉంటే రాష్ట్రం రూపురేఖలు మారిపోయేవన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు, నీరందించే పోలవరం ప్రాజెక్టును ఆపివేశారన్నారు. చంద్రబాబునాయుడు మీద కక్షతో టీడీపీ పెట్టిన సంక్షేమ పథకాలను అపివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడుపై చాలా ప్రభుత్వాలు కేసులు వేసినా నిరూపించలేకపోయాయని, అదీ ఆయనలోని నిజాయితీ అని అన్నారు. అందుకే మీరందరూ చేయిచేయి కలిపి కొన్ని రోజులు కష్టపడితే మన ప్రభుత్వం వస్తుందన్నారు. 'ప్రతి ఓటూ కూటమికే వేయాలి. దీనికి మీరు సైనా' అంటూ ప్రజలను ఆమె ఉత్తేజపరచారు. ప్రజలు కూడా తాము సంసిద్ధమని తెలిపేలా సై..సై అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, కొనకళ్ల నారాయణరావు పాల్గొన్నారు.

- బిళ్లనపల్లిలో మృతి చెందిన టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎదురువాడ కిరణ్ కుటుంబ సభ్యులను, ఎదురువాడ బసవరావు కుటుంబ సభ్యులను భువనేశ్వరి పరామర్శించారు. కిరణ్ కుమారులతో మాట్లాడుతూ బాగా చదువుకోవాలని, టీడీపీతో పాటు ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున కూడా అండగా నిలబడతామని భరోసా కల్పించారు.



బాపులపాడు మండలం బిళ్లనపల్లిలో బాధితకుటుంబ సభ్యులతో నారా భువనేశ్వరి

నేడు గుడివాడ నియోజకవర్గంలో పర్యటన

గుడివాడ : నిజం గెలవాలి యాత్రలో భాగంగా గురువారం నారా భువనేశ్వరి నియోజకవర్గంలో పర్యటించనున్నారని టీడీపీ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3.40 గంటలకు గుడివాడ మండలం మోటూరు, 4.30 గంటలకు గుడ్లవల్లేరు మండలం అంగలూరు, 5 గంటలకు పోలిమెట్ల గ్రామాల్లో పర్యటిస్తారని పేర్కొన్నారు.

పశ్చిమపై వీడిన ఉత్కంఠ

- సుజనా చౌదరి పేరు ఖరారు చేసిన బీజేపీ అధిష్ఠానం
- మచిలీపట్నం ఎంపీ, అవనిగడ్డ ఎమ్మెల్యేపై వీడని సస్పెన్స్



(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : విజయవాడ పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా యలమంచిలి సుజనా చౌదరిని బీజేపీ అధిష్ఠానం ఖరారు చేసింది. పొత్తుల్లో భాగంగా విజయవాడ పశ్చిమను తొలుత జనసేనకు కేటాయించారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో ఈ స్థానాన్ని బీజేపీకి ఇచ్చారు. ఈ స్థానం నుంచి బీజేపీ తరపున పలువురి పేర్లు ప్రచారంలోకి వచ్చినా చివరికి సుజనా చౌదరి వైపు పార్టీ పెద్దలు మొగ్గు చూపారు. సుజనా చౌదరి కంచికచర్లకు చెందినవారు. ఆయన రాజకీయ ప్రస్థానం టీడీపీ నుంచి ప్రారంభమైంది. ఎన్టీఆర్ ట్రస్టు అడ్వయిజర్‌గా ప్రస్థానాన్ని మొదలుపెట్టారు. ఆ తర్వాత పార్టీలో కీలకనేతగా ఎదిగారు. రాజ్యసభ సభ్యుడిగా, కేంద్రమంత్రిగా పనిచేశారు. తర్వాత చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలతో ఆయన టీడీపీని వీడి బీజేపీలో చేరారు.

ఎన్టీఆర్ జిల్లా కూటమి అభ్యర్థుల ఖరారు

పశ్చిమ సీటుపై స్పష్టత రావడంతో ఎన్టీఆర్ జిల్లాలో అన్ని స్థానాలకు కూటమి అభ్యర్థులు ఖరారయ్యారు. ఇక కృష్ణాజిల్లాలో మచిలీపట్నం ఎంపీ, అవనిగడ్డ అసెంబ్లీ స్థానాలపై స్పష్టత రావాల్సి ఉంది.

- మిగతా 6లో



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) : 6-24 (గురు)

సహర్ (ఉదయం) : 4-45 (శుక్ర)

దుర్గమ్మకు కానుకల ఆదాయం

25 రోజులకు రూ.3.78 కోట్లు

తేలప్రోలులో వాగు కబ్జా



ఉంగుటూరు మండలం తేలప్రోలు వాగు స్థలంలో ఆక్రమణలు షురూ

- వైసీపీ నేతల అండదండలతో గప్‌చుప్‌గా వాగు ఆక్రమణలు
- పేదలను ఉసిగొల్పి ఆక్రమణలకు పిలుపు
- ఇళ్ల పట్టాలిస్తామంటూ మభ్యపెట్టే ప్రయత్నం
- ఓట్ల కోసం వైసీపీ దుష్ట రాజకీయం

"ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా.. వైసీపీ నాయకుల దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయి. ఓట్ల రాజకీయాలు పతాకస్థాయికి చేరుకుంటున్నాయి. పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో వారిని మభ్యపెట్టి ఓట్లను దండుకోవటానికి ప్రభుత్వ స్థలాలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇళ్ల పట్టాలిస్తామని, ఇళ్లు వేసుకోమని జనాన్ని ఉసిగొలుపుతున్నారు. ఓట్ల వేట లక్ష్యంగా సాగిస్తున్న ఈ చర్యలతో అధికార పార్టీ లాభపడుతుండగా .. పాపం చివరికి ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి తలెత్తుతోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ /ఉంగుటూరు): కృష్ణాజిల్లా గన్నవరం మండలంలో ఓట్ల వేటలో భాగంగా ప్రభుత్వ భూములు, చెరువులు, కాలువలను ఆక్రమించుకున్నవారికి పొజిషన్ పట్టాలిచ్చేయటం తెలిసిందే. గన్నవరం మండలంలో పలు కాలువలను కబ్జా చేసిన వారి పేరుతో రికార్డులు కూడా మారిపోయిన ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. ఇదే తరహాలో బాపులపాడు మండలంలో వాగు, చెరువు భూముల్లో జగనన్న కాలనీల పేరుతో పట్టాలిచ్చేయటం జరిగింది. ఇదే విధానాన్ని ఉంగుటూరు మండలంలో కూడా వైసీపీ నాయకులు అనుసరిస్తున్నారు. జగనన్న కాలనీలంటూ నయవంచన చేస్తున్నారు. వాగు భూములను ఆక్రమించుకోమని పురిగొల్పారు. ఉంగుటూరు మండలంలోని తేలప్రోలు గ్రామంలో రైల్వేట్రాక్‌కు సమీపంలో ఉన్న వాగు స్థలం 7 ఎకరాల మేర ఆక్రమణలకు గురౌతోంది. ఈ భూమిని కొంత కాలంగా సాగు చేసుకుంటున్నారు. సాగు వరకు ఫర్వాలేదు. ఎందుకంటే వరద వస్తే పంట వరకు కొట్టుకు పోతుంది. పక్కాగా ఇళ్లు వేస్తే మాత్రం వాగు డైరెక్షన్ మారి పరిసర ప్రాంతాల్లో ఉన్న జగనన్న కాలనీతో పాటు, పంట పొలాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. ఈ వాగు చాలా ప్రధానమైనది. బల్లిపర్రు ఎగువ క్యాచ్‌మెంట్ ఏరియా వరద నీరు ఈ వాగులోకే వస్తుంది.

- మిగతా 6లో

ధాన్యం కొనుగోళ్లు 4 రోజులే..!



జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి వరిసాగుకు అధికారికంగా అనుమతులు ఇవ్వకున్నా కంకిపాడు, గన్నవరం, ఉయ్యూరు, పామర్రు తదితర ప్రాంతాల్లో 25 వేల ఎకరాలకుపైగా బోరునీటి ఆధారంగా వరి సాగుచేశారు. రబీ సీజన్‌లో సాగుచేసిన వరిపంట ఏప్రిల్ నెలాఖరుకు కోతకు వస్తుంది. మలివిడతగా జిల్లాలో ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం అనుమతులు ఇస్తే, ఖరీఫ్ సీజన్‌లో మిగులుబాటుగా ఉన్న ధాన్యం కోటాలో రబీ సీజన్‌లో పండించిన ధాన్యాన్ని కలిపి కొనుగోలు చేసే ఆనవాయితీ ప్రతిఏటా జిల్లాలో కొనసాగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో అధికారులంతా ఎన్నికల విధుల్లో బిజీగా ఉండనుండటంతో మళ్లీ ధాన్యం కొనుగోలుకు ఎంతమేర అనుమతులు ప్రభుత్వం ఇస్తుందనే భయం రైతులను వెంటాడుతోంది. ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు రెండో విడతగా కొనుగోలు చేసేందుకు అనుమతులు ఇవ్వకుంటే రబీలో పండించిన ధాన్యాన్ని మిల్లర్లు, వ్యాపారులు నిర్ణయించిన ధరకే విక్రయించాల్సిందేనని రైతులు చెప్పుకుంటున్నారు. జిల్లాలో రబీ సీజన్‌లో వరి సాగుకు అధికారికంగా అనుమతులు ఇవ్వలేదని, కాలువలకు నీరు కూడా విడుదల చేయలేదని, దీంతో రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేసే అంశం తమ పరిధిలోకి రాదని అధికారులు ఖరాఖండిగా చెబుతున్నారు.

రబీ ధాన్యం కొనుగోలు ఎలా?

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను ఈనెల 31వ తేదీ నుంచి నిలిపివేయనున్నారు. ఈ మేరకు జేసీ గీతాంజలి శర్మ అధికారికంగా బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి గతేడాది నవంబరు 16వ తేదీన ప్రారంభమైన ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఈ నెలాఖరుతో ముగియనుంది. రైతుల వద్ద ఇంకా ధాన్యం ఉంటే ఈ నెలాఖరులోపు విక్రయించుకుకోవాలని ఆమె రైతులకు సూచించారు. మిగిలి ధాన్యం ప్రైవేటు వ్యాపారులు చెప్పిన ధరకు అమ్ముకోక తప్పని పరిస్థితుల్లోకి రైతులను నెట్టేసినట్టే.

- ధాన్యం కొనుగోళ్లు నిలిపివేస్తే వ్యాపారులు నిర్ణయించిన ధరకు తెగనమ్ముకోవాలంటున్న రైతులు
- ధాన్యం సేకరణకు మళ్లీ అనుమతులు తీసుకుంటామంటున్న అధికారులు

ఈనెల 31కి నిలిపివేస్తున్నట్టు జేసీ ప్రకటన

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో గత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 10.50 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాగా ఉంది. ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి 4.89 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. రబీ సీజన్‌లో రెండో పంటగా మినుము పంటను సాగు చేయడంతో రైతులు వరిపంటను కుప్పలమీదనే ఉంచారు. ప్రస్తుతం మినుముతీత పనులు దాదాపు పూర్తికావడంతో వరికుప్ప నూర్పిళ్లు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలును మరో నాలుగు రోజుల్లో నిలిపివేస్తామని అధికారులు ప్రకటించడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతుధర ప్రకారం ఏ-గ్రేడ్ ధాన్యం 75 కిలోల బస్తాకు రూ.1652 చెల్లించాలి. ధాన్యం కొనుగోళ్లు నిలిపివేస్తే బహిరంగ మార్కెట్‌లో ధాన్యం ధరలు అమాంతం పడిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రస్తుతం బస్తా ధాన్యానికి ప్రైవేటు వ్యాపారులు రూ.1500 నుంచి 1530 వరకు ధర మాత్రమే చెల్లిస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను మూసివేస్తే వ్యాపారులు, మిల్లర్లు, మధ్యవర్తులు నిర్ణయించిన ధరకే ధాన్యం తెగనమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని రైతులు వాపోతున్నారు. జిల్లాలో ఇంకా 1.50 లక్షల టన్నుల ధాన్యం కుప్పలపై ఉన్నట్టు అంచనాగా ఉంది. అధికారులు 50 వేల టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి సర్వర్‌ను ఈ నెలాఖరు నాటికి మూసివేస్తే ధాన్యం కొనుగోలు పూర్తిస్థాయిలో నిలిచిపోతుంది. జిల్లా అధికారులు ప్రభుత్వానికి లేఖరాసి మలివిడతగా ధాన్యం కొనుగోలుకు అనుమతులు తెస్తేనే మళ్లీ ధాన్యం కొనుగోలు చేసేందుకు మార్గం సుగమం అవుతుంది. అధికారులు జిల్లాలో 50 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని చెబుతున్నా, ఈ నాలుగురోజుల వ్యవధిలో ఇంతమేర ధాన్యం కొనుగోలు చేయడం సాధ్యమవుతుందా లేదా అనేది అనుమానమే.

మలి విడత ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వ అనుమతి కోరతాం

జిల్లాలో రైతుల వద్ద ఉన్న ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. మరో 50 వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇంకా రైతుల వద్ద ధాన్యం ఉంటే మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ అనుమతి కోరతాం. ఇప్పటివరకు రైతులకు ఇవ్వాల్సిన ధాన్యం బిల్లులు చెల్లింపులు చేశాం.

- తోట సతీష్, జిల్లా పౌరసరఫరాలసంస్థ మేనేజర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ధాన్యం బకాయిలు రూ.355.40 కోట్లు రైతుల ఖాతాల్లో జమ



ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 55,671 మంది రైతుల నుంచి ప్రభుత్వం ఇప్పటి వరకు 4.89 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. ఈ ధాన్యం విలువ రూ.1068.90 కోట్లు. జనవరి 18వ తేదీ నాటికి రూ.713.50 కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. మరో 17,079 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసినా, రెండు నెలలకుపైగా ధాన్యం బిల్లులను పెండింగ్‌లోనే ఉంచింది. ఈ బకాయిపై ఆంధ్రజ్యోతిలో గత ఆదివారం 'అన్నదాతకు అప్పులకుప్ప' శీర్షికతో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఎట్టకేలకు మంగళవారం రూ.355.40 కోట్లను రైతుల ఖాతాల్లో జమచేశారు.



దుర్గగుడిలో కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

దుర్గమ్మకు కానుకల ఆదాయం
25 రోజులకు రూ.3.78 కోట్లు

వన్‌టౌన్, మార్చి 27 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం మహామండపంలోని ఆరో అంతస్తులో లెక్కించారు ఈవో రామారావు, ఈఈ కోటేశ్వరరావు, పోలీసు, ప్రత్యేక పోలీసు తదితరుల పర్యవేక్షణలో మొత్తం 25 రోజులకుగాను వచ్చిన కానుకలను లెక్కించారు. నగదు రూపేణా రూ. 3,78,72,537, 900 గ్రాముల బంగారం, ఏడు కిలోల 820 గ్రాముల వెండి లభించింది. 3633 యూఎస్‌ఏ డాలర్లు, 100 ఓమన్ రియాల్స్, 20 యూకే పౌండ్లు, 30 ఆస్ట్రేలియా డాలర్లు, 135 యూరో డాలర్లు, 138 సింగపూర్ డాలర్లు, 30 యూఏఈ దీర్హమ్‌లు, 2.5 కువైట్ దీనార్లు, 104 ఖతార్ రియాల్స్, ఇండోనేషియా రూపాయలు 60 వచ్చాయి. ఈ హుండీ ద్వారా రూ 1,22,800 సమకూరాయి.



వేణుగోపాలస్వామికి పూర్ణాహుతి

వైభవంగా వేణుగోపాలుని వసంతోత్సవం

గంపలగూడెం, మార్చి 27 : నెమలి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామికి వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు తిరునగరి గోపాలచార్యుల ఆధ్వర్యంలో స్వామికి సువర్ణోత్సవములు, వసంతోత్సవం, పూర్ణాహుతి, చక్రస్నానం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామికి పల్లకిలో గ్రామోత్సవం చేశారు. రాత్రికి ఆలయ ప్రాంగణంలో నీటి కొలనులో స్వామి తెప్పోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా పీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో భక్తి గీతాలాపన, శివరంజనీ నాట్య మండలిచే శ్రీకృష్ణార్జున గయోపాఖ్యానం, పలు నాటకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కావూరి శశిరేఖ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎన్వీ సాంబశివరావు, సర్పంచ్ దుబ్బాకు రామకృష్ణ, ట్రస్టుబోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అవనిగడ్డలో సమావేశమైన సర్పంచ్‌లు

మండలికి సీటు ఇవ్వకుంటే రాజీనామా

» హెచ్చరించిన సర్పంచ్‌లు

అవనిగడ్డ, మార్చి 27 : అవనిగడ్డ అసెంబ్లీ సీటును మండలి బుద్ధప్రసాద్‌కు ఇవ్వకుంటే సామూహిక రాజీనామాలు చేస్తామని నియోజకవర్గ టీడీపీ సర్పంచ్‌లు అల్టిమేటం జారీచేశారు. బుధవారం అవనిగడ్డలో సమావేశమైన సర్పంచ్‌లు మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వంలో అనేక ఇబ్బందులు, ఒత్తిళ్లకు గురైన సమయంలో మాజీ ఉపసభాపతి తమకు అండగా నిలిచారని, అలాంటి వ్యక్తిని కాదని పొత్తులో భాగంగా ఇతరులకు కేటాయిస్తే పార్టీకి రాజీనామా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ముప్పనేని రవిప్రసాద్, పైడిపాముల కృష్ణకుమారి, బాణావత్ వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు నిర్ణయాలు వెబ్‌సైట్‌లో ఉంచాలి

» పీవీ ఫణికుమార్

మచిలీపట్నం టౌన్, మార్చి 27 : వైసీపీ పాలనలో వెంకటేశ్వరస్వామి ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు నిర్ణయాలను వెబ్‌సైట్‌లో ఎందుకు ఉంచడం లేదని టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి కృష్ణాజిల్లా కన్వీనర్ పీవీ ఫణికుమార్ ప్రశ్నించారు. బుధవారం శిడింబి అగ్రహారంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీటీడీ చైర్మన్ ఏకపక్ష నిర్ణయాలతో కాంట్రాక్టర్లకు వర్కులు కట్టబెట్టి కమీషన్లు దండుకుంటున్నారని ఆరోపించారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా వెబ్‌సైట్‌లో టీటీడీ ఆదాయ వ్యయాల వివరాలు ఉంచాలన్నారు. 2023 సెప్టెంబరు నుంచి బోర్డు తీర్మానాలను ఆన్‌లైన్‌లో ఉంచడం లేదని ఆరోపించారు. దేవస్థాన సత్రాలు కూల్చడం వల్ల పేద భక్తులు అలిపిరి, చెట్లకింద ఉండాల్సి వస్తోందన్నారు. కోడ్ అమలులో ఉన్నా కొత్తగా వర్క్ ఆర్డర్లు ఇస్తున్నారని ఆరోపించారు.

సరకు రవాణాలో నెంబర్ వన్

» ఆల్‌టైమ్ రికార్డు నమోదు చేసిన విజయవాడ డివిజన్

» మార్చి 26 వ తేదీ నాటికి రూ. 3975 కోట్ల ఆదాయం

» 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ. 3968 కోట్ల రికార్డు బ్రేక్

» మార్చి 31 నాటికి రూ. 4 వేల కోట్లకు చేరుకునే అవకాశం

» వివరాలను డీఆర్‌ఎం ఆనంద్‌కు వివరించిన డీసీఎం రాంబాబు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ / రైల్వేస్టేషన్) : ఆర్థిక సంవత్సరం ముగియటానికి మరో ఐదు రోజుల ముందుగానే సరకు రవాణాలో విజయవాడ రైల్వే డివిజన్ ఆల్‌టైమ్ రికార్డును నమోదు చేసింది. సరకు రవాణాలో 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.3968 కోట్ల రికార్డును చెరిపేస్తూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో మరో ఐదు రోజులు ముందుగానే రూ.3975 కోట్లను సాధిస్తూ ఆల్‌టైమ్ రికార్డును నమోదు చేసింది. మార్చి 26వ తేదీ నాటికి ఈ గణాంకాలను నమోదు చేసింది. ఆల్‌టైమ్ రికార్డు వివరాలను బుధవారం విజయవాడ రైల్వే కమర్షియల్ విభాగం సీనియర్ డీసీఎం వి.రాంబాబు, విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్‌కు వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 36.2 మిలియన్ మెట్రిక్ టన్నుల ఫ్రైట్ లోడింగ్ ద్వారా ఈ ఆదాయం సాధించినట్టు రాంబాబు వివరించారు. విజయవాడ డివిజన్ సాధించిన ప్రగతి దేశంలోనే అత్యుత్తమ ఫలితాల జాబితాలో ఉండే అవకాశం ఉంది. ఈ ఏడాది మార్చి 16వ తేదీ నాటికే 2022-23లో సాధించిన ఆదాయాన్ని దాటి 8 శాతం వృద్ధితో రూ. 3878 కోట్ల ఆదాయాన్ని సాధించింది. దీంతో 2018- 19 లో సాధించిన ఆదాయం రూ. 3968 కోట్లపై రైల్వే డివిజనల్ కమర్షియల్ విభాగం అధికారులు దృష్టి సారించారు. ఈ క్రమంలో మార్చి 26 వ తేదీ అంటే కేవలం పది రోజులలోనే ఆల్‌టైమ్ రికార్డును తిరగరాశారు. మార్చి 31వ తేదీ నాటికి రూ. 4 వేల కోట్ల ఆదాయం లక్ష్యంగా కమర్షియల్ విభాగం అధికారులు అడుగులు వేస్తున్నారు. విజయవాడ రైల్వే డివిజన్ సాధించిన ప్రగతి వెనుక అదానీ కృష్ణపట్నం పోర్టు ద్వారా అత్యధిక ఆదాయం వచ్చింది. కాకినాడ సీ పోర్టు ద్వారా వచ్చిన ఆదాయం రెండవ స్థానంలో ఉంది. ఈ ఏడాదిలో బొగ్గు 19.36 మిలియన్ మెట్రిక్ టన్నులు, ఎరువులు 6.68 మిలియన్ మెట్రిక్ టన్నుల మేర ప్రధాన రవాణా వస్తువుల కేటగిరిలో ఉన్నాయి.

అమరావతి రాజధాని కోసం..
అవమానాలెదుర్కొన్నా

» చంద్రబాబు సీఎం కావడం చారిత్రక అవసరం : వసంత వెంకట కృష్ణ ప్రసాద్



టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వసంత వెంకట కృష్ణ ప్రసాద్

ఇబ్రహీంపట్నం, మార్చి 27 : వైసీపీలో ఉండగా అమరావతి రాజధాని కోసం అడిగి అనేక అవమానాలు ఎదుర్కొన్నానని.. తనతో పాటు ఉన్న ఎమ్మెల్యేల్లో మల్లాది విష్ణు ఒక్కరే అమరావతి కోసం తనతో కలిసి ప్రశ్నించారని మైలవరం టీడీపీ ఉమ్మడి అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ గుర్తు చేశారు. విజయవాడ పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని)తో కలిసి ఆయన గుంటుపల్లి గ్రామంలో బుధవారం రాత్రి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏపీ ప్రజలకు అభివృద్ధితో కూడిన సంక్షేమం అవసరమని, అది చంద్రబాబు వల్లే సాధ్యమవుతుందని, ఆయన్ను సీఎం చేసుకోవడం చారిత్రాత్మక అవసరమన్నారు. ధర్నా అంటూ మైలవరం నియోజకవర్గ ప్రజల్ని పిలిచి చంద్రబాబు ఇంటిపైకి దాడికి వెళ్లారన్నారు. కక్షలు, కార్పణ్యాలు, వ్యక్తిగత దూషణలు, దాడులు ఇలా ఎంతకాలం పరిపాలన సాగిస్తారన్నారు. బూడిద, మట్టి, గ్రావెల్, ఇసుక మాఫియా చేసేవారు వేరొకరైతే.. ఆ నిందలు మొత్తం తనపై మోపి మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్నారు. వ్యాపారాలు పక్కన బెట్టి మైలవరం నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు వస్తే.. ఒక్క పైసా కూడా అభివృద్ధికి నిధులివ్వకుండా మొండిచేయి చూపి వేధించారన్నారు. గోదావరి జలాలను చింతలపూడి ద్వారా ఎన్‌ఎస్పీ కాలువల్లో పారించేందుకుగాను గత ప్రభుత్వంలో రూ.3 వేల కోట్లు ఖర్చుచేస్తే, వైసీపీ ప్రభుత్వం చింతలపూడి ఎత్తిపోతల పథకానికి కేవలం 5శాతం నిధులు కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరులో పేదలకు సేవచేస్తున్న ఎన్నారైపై వైసీపీ ప్రవర్తించిన తీరు దారుణమన్నారు. దేవినేని ఉమాకు తాను ఎప్పుడూ వ్యతిరేకం కాదన్నారు. టీడీపీలో ఉన్నత స్థానం ఆయనకు లభిస్తుందన్నారు. వైఎస్, కిరణ్‌కుమార్‌రెడ్డిలు గత ప్రభుత్వాలు చేసిన పనుల్ని కొనసాగిస్తే జగన్ మాత్రం తిరోగమనంలో వెళ్లారన్నారు. విద్యుత్, బస్సు చార్జీలు విపరీతంగా పెంచారన్నారు. ఇసుక దోపిడీపై ఎవ్వరూ మాట్లాడవద్దని హుకుం జారీ చేశారని ఆవేదన చెందారు. వైసీపీని వీడి టీడీపీలోకి వచ్చిన వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీ ఒంటెత్తు పోకడ నచ్చక పార్టీని వీడి టీడీపీలో చేరినట్టు చెప్పారు. ఎన్టీఆర్ జిల్లాలో అన్నిస్థానాల్లో టీడీపీ కైవసం చేసుకోవాలని, దీనికి ప్రజలంతా సంపూర్ణ మద్దతివ్వాలని కోరారు. తనవల్ల గుంటుపల్లి గ్రామంలో ఇబ్బందులు పడిన ప్రతిఒక్కరికీ ఆయన పేరు పేరునా క్షమాపణలు చెప్పారు. ఏదేమైనా ప్రతి ఒక్కరిని కలుపుకొని టీడీపీ విజయానికి కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్ర గాయాలు

చల్లపల్లి, మార్చి 27 : చల్లపల్లి స్టేషన్ పరిధిలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. జాతీయ రహదారి(బైపాస్)పై గంగులవారిపాలెం సమీపంలో మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. మోపిదేవి మండలం కప్తానుపాలెంలోని వేములపల్లి హోం ఫుడ్స్ నిర్వాహకులు వేములపల్లి శ్రీహరి దంపతులు కప్తానుపాలెం నుంచీ బొలెరో వాహనంలో రామానగరం వెళుతుండగా ఆక్వా కంటైనర్ ఢీకొట్టింది. ప్రమాదంలో శ్రీహరికి తీవ్రగాయాలుకాగా ఆసుపత్రికి తరలించారు. మరో రామానగరం చెరువు సమీపంలో పలావ్ స్టాల్ నడుపుకుంటున్న చల్లపల్లికి చెందిన అబూ బకర్ సిద్ధిఖ్ షాపు సమీపంలో రోడ్డుపై నడిచి వెళుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో యువకుడికి కాళ్లు, చేతులు విరిగాయి. కుటుంబ సభ్యులు సిద్ధిఖ్‌ను గుంటూరు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.



నానికి ప్రజాసమస్యలు పట్టవా : వెనిగండ్ల

గుడివాడ, మార్చి 27 : స్థానిక ఎమ్మెల్యే కొడాలి నానికి ఓట్ల రాజకీయం తప్ప ప్రజల బాగోగులు పట్టవా అని టీడీపీ ఉమ్మడి అభ్యర్థి వెనిగండ్ల రాము ప్రశ్నించారు. బుధవారం 32వ వార్డులో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ' కార్యక్రమాన్ని చేపట్టారు. తొలుత స్థానిక పాటిమీద గల వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి వార్డులో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, డబ్బు సంపాదన తప్ప ప్రజాసమస్యలు పట్టని వ్యక్తి ఎమ్మెల్యేగా ఉండటం దురదృష్టకరమన్నారు. నానికి నిన్నటి వరకు కనిపించని ప్రజలు ప్రస్తుతం దైవసమానులుగా కనిపిస్తున్నారని ఎద్దేవ చేశారు. నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని వెనిగండ్ల పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, యలవర్తి శ్రీనివాసరావు, దింట్యాల రాంబాబు, మజ్జి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కుదరవల్లిలో వెనిగండ్లకు ఘన స్వాగతం

నందివాడ (కుదరవల్లి) : కుదరవల్లి మాజీ సర్పంచ్ మనిముక్క వేణు ఆధ్వర్యంలో వెనిగండ్లకు ఘనస్వాగతం లభించింది. బుధవారం కుదరవల్లిలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి గ్రామ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలంతా వైసీపీ మోసాలను గమనించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలని కోరారు. రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ఓటు ఆయుధంతో బుద్ధి చెప్పాలన్నారు. మండల నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద వెనిగండ్ల, రావి, కార్యకర్తలు

నోట్లో ఆలౌట్ పోశారు

» నేరం అంగీకరించమని ఒత్తిడి చేశారు

» న్యాయాధికారికి వాంగ్మూలం ఇచ్చిన నిందితురాలు

» పెనమలూరు ఇన్‌స్పెక్టర్, మహిళా ఎస్సైకి షోకాజ్ నోటీసులు

విజయవాడ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : "నేరం అంగీకరించి కేసును రాజీ చేసుకోవాలని పోలీసులు ఒత్తిడి చేశారు. అంగీకరించకపోయే సరికి నోట్లో ఆలవుట్ లిక్విడ్ పోశారు. ప్రైవేటు వైద్యులతో వైద్యం చేయించారు. మహిళనని చూడకుండా అసభ్యకరంగా దూషించారు. నా కుటుంబసభ్యులను ఇష్టానుసారంగా తిట్టారు" అని దావులూరి పద్మావతి అనే నిందితురాలు న్యాయాధికారికి వాంగ్మూలం ఇవ్వడం కృష్ణా జిల్లాలో సంచలనం కలిగించింది. నిందితురాలి వాంగ్మూలం నమోదు చేసుకున్న న్యాయాధికారి సంబంధిత పోలీసులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం గంగూరులోని యూనియన్ బ్యాంక్ ఇండియా మేనేజర్ దావూలూరి పద్మావతికి, ఆమెకు పరిచయం ఉన్న యోగేశ్వరరావుకు మధ్య వివాదం ఉంది. తాను బ్యాంక్‌లో తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలను పద్మావతి కాజేసిందని పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆరోపణల నేపథ్యంలో బ్యాంక్ ఉన్నతాధికారులు పద్మావతిని సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న పద్మావతిని పెనమలూరు పోలీసులు ఈనెల 22వ తేదీన అరెస్టు చేశారు. ఆ మర్నాడు విజయవాడ సెంట్రల్ తహసీల్దార్, మండల మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. వాస్తవానికి పద్మావతిని ఆరో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ (తాలుకా) కోర్టులో హాజరుపరచాల్సి ఉంది. ఆ రోజున న్యాయాధికారులకు శిక్షణ తరగతులు ఉండటంతో సెంట్రల్ తహసీల్దార్‌కు ఇన్‌చార్జి ఇచ్చారు. తహసీల్దార్ ఎదుట ఆమెను హాజరుపరచగా రిమాండ్ విధించారు. తాను చెప్పుకునేది ఉందని పద్మావతి విన్నవించుకుంది. తనకు రిమాండ్ విధించే అధికారం ఉందని, వాంగ్మూలాన్ని రికార్డు చేసే అధికారం లేదని చెప్పి తహసీల్దార్ ఆమె విన్నపాన్ని తిరస్కరించారు. విజయవాడలో ఉన్న జిల్లా కారాగారంలో ఖాళీ లేకపోవడంతో పద్మావతిని మచిలీపట్నంలోని సబ్‌జైలుకు తరలించారు.

తండ్రి వేసిన పిటిషన్‌తో..

తర్వాత పద్మావతి తండ్రి దావులూరి వెంకట రంగారావు కుమార్తె తరఫున మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో ప్రత్యేకంగా ఒక పిటిషన్ వేశారు. రిమాండ్ విధించే ముందు తన కుమార్తె చెప్పదలచుకున్న విషయాన్ని మండల మేజిస్ట్రేట్ వినలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణ సమయంలో పోలీసులు ఆమెను దారుణంగా వేధించారని పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయాధికారి ఎ.సత్యానంద్ ఆరో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టుకు నిందితురాలి వాంగ్మూలం వినాలని ఆదేశాలు జారీచేశారు. మచిలీపట్నం జైల్లో ఉన్న పద్మావతిని పోలీసులు కోర్టులో మంగళవారం హాజరుపరిచారు. తనపై ఫిర్యాదు చేసిన యోగేశ్వరరావుతో కేసును రాజీ చేసుకోవాలని, బంగారం అతనిదేనని అంగీకరించాలని పోలీసులు విచారణలో ఒత్తిడి చేశారని ఆమె ఆరోపించింది. దీనికి ఒప్పుకోకపోవడంతో నోటిలో ఆలవుట్ లిక్విడ్‌ను పోశారని న్యాయాధికారి దృష్టికి తీసుకెళ్లింది. అంతేగాకుండా తనను, కుటుంబసభ్యులను అసభ్యకరంగా దూషించారని చెప్పింది. అపస్మారకస్థితిలోకి వెళ్లిన తర్వాత ప్రైవేటు వైద్యులతో చికిత్స చేయించి కోర్టులో హాజరుపరిచారని వాంగ్మూలం ఇచ్చింది.

లిక్విడ్‌లో ఉన్న రసాయనాలు శరీరంలో చేరడంతో వణుకు వస్తోందని చెప్పింది. పద్మావతి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్న ఆరో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి లెనిన్‌బాబు పెనమలూరు ఇన్‌స్పెక్టర్ రామారావు, మహిళా ఎస్ఐ ఉషారాణికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పద్మావతి వాంగ్మూలంపై సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. ఆమెను విజయవాడలోని జిల్లా జైల్లో ఉంచాలని ఆదేశాలు ఇచ్చారు. ఆమెకు ప్రభుత్వాసుపత్రిలో వైద్యం చేయించి, శరీరంలో లిక్విడ్ రసాయనాలు ఎంత మేరకు ఉన్నాయో నిర్ధారించి ఆ నివేదికను వచ్చేనెల రెండో తేదీ నాటికి అందజేయాలని జైలు సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

సీ-విజిల్ ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, మార్చి 27 : జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ)ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, అదేవిధంగా సీ-విజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఢిల్లీరావు, జేసీ పి.సంపత్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి తదితరులతో కలిసి హాజరయ్యారు. వివిధ ఫారాల పరిష్కారం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఎన్నికల ప్రచారం, అనుమతుల జారీ, ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై సీఈవో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు జిల్లాలో ఎంసీసీ అమలు సరళితో పాటు వివిధ అంశాలను వివరించారు. సీ-విజిల్ ద్వారా వచ్చిన 188 ఫిర్యాదులను సత్వరం పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. అదేవిధంగా అనుమతుల కోసం ఎన్‌కోర్‌లో 198 విజ్ఞప్తులు వచ్చాయన్నారు. వీటిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్టు తెలిపారు. ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ (ఈఎస్ఎంఎస్)ను ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల అధికారుల సమన్వయంతో పకడ్బందీగా అమలు చేయడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఢిల్లీరావు, అధికారులు

లింగ నిర్ధారణ పరీక్ష నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

వన్‌టౌన్ : గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్ష నిషేధ చట్టాన్ని ఎన్టీఆర్ జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఇందుకు సంబంధించిన డెకాయ్ ఆపరేషన్లను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. నగరంలోని కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో బుధవారం లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుపై స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేషన్ అథారిటీ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ ఇందుకు సంబంధించిన స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, నియమ నిబంధనల గురించి వివరించారు. చట్ట ఉల్లంఘనలు జరగకుండా చర్య తీసుకోవాలని కోరారు. ఏఎన్ఎంలు, అంగన్వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కొత్త స్కానింగ్ సెంటర్ల ఏర్పాటుకు వచ్చిన ఐదు దరఖాస్తులు, రెన్యూవల్‌కు సంబంధించి 8 దరఖాస్తులు, రిజిస్టర్ సర్టిఫికేట్ల సవరణలకు సంబంధించి 15 దరఖాస్తులు, రిజిస్ట్రేషన్ రద్దుకు సంబంధించి 2 దరఖాస్తులు వచ్చాయి. వీటిని కమిటీ పరిశీలించి ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ మిషన్‌లో భాగంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో డిజిటలైజేషన్‌లో జరిగే కార్యక్రమాలపై గోడపత్రికను, కరపత్రాలను ఆవిష్కరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, అదనపు జిల్లా జడ్జి, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఏ.సత్యానంద్, పోలీస్ కమిషనరేట్ నుంచి కె.శ్రీనివాసరావు, కె.నాగిని, వాసవ్య మహిళా మండలి చైర్‌పర్సన్ లక్ష్మీ, డీపీఎంవో డాక్టర్ నవీన్, డిజిటల్ హెల్త్ మిషన్ ప్రతినిధి మనోజ్ తదితరు పాల్గొన్నారు.





జాబితాను చూపుతున్న నెట్టెం తదితరులు

ఒక్క చాన్స్‌తో జగన్ రూ.8,23,600కోట్లు దోపిడీ

» ఎన్నికలు వచ్చాయనే ప్యాలెస్ విడిచి ప్రజల్లోకి

» నెట్టెం రఘురాం ధ్వజం

జగ్గయ్యపేట, మార్చి 27 : ఒక్క చాన్స్ అని ప్రజలను నమ్మించి సీఎం అయిన జగన్ రెడ్డి ఐదేళ్లలో రూ.8,23,600 కోట్లు దోచేసి.. ముఖ్యమంత్రి హోదాలో పరదాలు లేకుండా ఏనాడూ భూమ్మీద కాలుమోపని నిన్ను.. ఎన్నికలు వస్తున్నాయని తిరిగి బస్సుయాత్ర చేపడితే ప్రజలు నిన్ను నమ్ముతారా.. అని మాజీమంత్రి, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ధ్వజమెత్తారు. బుధవారం పట్టణంలో తన నివాసంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, 85 శాతం హామీలను తుంగలో తొక్కిన జగన్‌రెడ్డిని ఓడించేందుకు ప్రజలు సిద్ధం అంటున్నారని అన్నారు. ఐదేళ్లలో జగన్ రెడ్డి రూ.8,23,600 కోట్లు దోచేశాడని ఆరోపించారు. నాసిరకం మద్యం తాగి 35లక్షల మంది ఆరోగ్యం దెబ్బతినగా, 30వేల మంది ప్రాణాలు కోల్పోయారని, అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీ నేరవేరలేదని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని మాట తప్పాడని, రోడ్లు గురించి మర్చిపోవాల్సి వచ్చిందని చెప్పారు. అన్ని రకాలుగా మాట తప్పి, మడమ తిప్పిన జగన్ రెడ్డికి బుద్ధి చెప్పటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అధికారంలోకి రాగనే అమరావతిని వాషింగ్టన్‌గా మారుస్తానని, రాష్ట్రాన్ని మొత్తం వాష్ చేశాడని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సబ్‌ప్లాన్ నిధులు రూ.1,14,566 కోట్లు దారి మళ్లించాడని ఆరోపించారు. సమావేశంలో నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కన్నెబోయిన రామలక్ష్మి, గింజుపల్లి రమేష్, కారుపాటి డేవిడ్, తాళ్లూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రూపాయి పెట్టుబడి రాలేదు

» దేవినేని ఉమా



గొల్లపూడి, మార్చి 27 : ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రానికి రూపాయి పెట్టుబడి రాలేదని, ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. బుధవారం ఆయన గొల్లపూడిలో విలేకర్లతో మాట్లాడుతూ, గతంలో టీడీపీ హయాంలో చంద్రబాబు నాయుడు రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చారని గుర్తు చేశారు. ఉద్యోగాల భర్తీ, రెగ్యులరైజ్ అంతా ఎన్నికల డ్రామాలు అని ఉత్తుత్తి జీవోలు, డమ్మీ బటన్లతో ఇప్పటి వరకు జగన్ రెడ్డి ప్రజలను మోసం చేశారన్నారు. వైసీపీకి ఓటు వేస్తే తమ కుటుంబాలకు అన్యాయం చేసుకున్నట్టే అన్నారు. కూటమి అధికారం చేపట్టిన వెంటనే చంద్రబాబు తొలి సంతకం మెగా డీఎస్సీపైనే పెడతారన్నారు.

పశ్చిమపై వీడిన ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

అవనిగడ్డ నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా ఎవరు పోటీ చేస్తారన్న దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. పొత్తులో భాగంగా ఈ స్థానాన్ని జనసేనకు కేటాయించారు. ఇక్కడి నుంచి రేసులో ప్రముఖ వ్యాపారవేత్త విక్కుర్తి శ్రీనివాస్, ఎన్ఆర్ఐ బొబ్బా గౌతమ్, అప్పికట్ల అప్పారావు, మాదివాడ వెంకటకృష్ణ రామాంజనేయులు ఉన్నారు. వీరిలో విక్కుర్తి శ్రీనివాస్‌కు టికెట్ ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ రెండు స్థానాలతో పాటు మచిలీపట్నం పార్లమెంట్ స్థానాన్ని జనసేనకు కేటాయించారు. ఈ స్థానం నుంచి వల్లభనేని బాలశౌరి పేరును ప్రకటించాల్సి ఉంది.

పేరు : యలమంచిలి సత్యనారాయణ చౌదరి (సుజనా చౌదరి)
పుట్టిన తేదీ : 1961, జూన్ 2
స్వగ్రామం : పొన్నవరం, కంచికచర్ల, ఎన్టీఆర్ జిల్లా
తల్లిదండ్రులు: వై.జనార్దన్‌రావు, సుశీల కుమారి
భార్య : పద్మజ
పిల్లలు : కార్తీక్, నాగచాందిని
విద్యాభ్యాసం : మెకానికల్ ఇంజనీరింగ్

కుటుంబ నేపథ్యం : సుజనా తాతగారు యలమంచిలి సత్యనారాయణ చౌదరి కృష్ణాజిల్లా నుంచి ఎంపికైన తొలి ఐపీఎస్ అధికారి. సుజనా కుటుంబబంధాలకు అధిక గౌరవం ఇస్తారు. ఆంగ్లంలో తల్లి పేరులోని తొలి రెండు అక్షరాలు, తండ్రి పేరులోని తొలి నాలుగు అక్షరాలతో తన కంపెనీకి 'సుజనా' అని పేరు పెట్టుకున్నారు.

తేలప్రోలులో వాగు కబ్జా

(5వ పేజీ తరువాయి)

ఇక్కడి నుంచి ఈ వాగు తేలప్రోలులోని రైల్వేబ్రిడ్జి, ఎన్‌హెచ్-16, ఏలూరు కాల్వల దిగువగా అంటే అండర్ కెనాల్ ద్వారా ప్రవహిస్తూ బుడమేరులో కలుస్తుంది. దీనిని బట్టి ఈ కాలువకు ఉన్న ప్రాధాన్యత ఏమిటో అర్థం అవుతుంది. ఇలాంటి కాలువపై ప్రస్తుతం తాత్కాలికంగా పాకలు ప్రారంభించారు. ఎన్నికల ముసుగులో పక్కా ఇళ్లు కట్టుకోమని, పట్టాలతో పాటు పొజిషన్ సర్టిఫికెట్లు కూడా ఇప్పిస్తామని వైసీపీ నేతలు ఆఫర్లు చేస్తున్నారు. వాగు భూముల్లో ఏవిధంగా పొజిషన్ సర్టిఫికెట్లు ఇస్తారో రెవెన్యూ అధికారులే చెప్పాలి. పేదలకు ఇలాంటి విషయాల మీద అవగాహన ఉండదన్న ఉద్దేశంతో .. వైసీపీ నేతలు వారిని మభ్యపెడుతున్నారు. ఇలా మభ్యపెట్టడం వల్ల వారికి ప్రయోజనం చేకూర్చటం ద్వారా ఓట్లను దండుకోవచ్చన్నది వైసీపీ నేతల వ్యూహంగా ఉంది. వాగు ఆక్రమణలను తక్షణం అరికట్టాలని లేనిపక్షంలో పోరాటాలు నిర్వహిస్తామని స్థానిక రైతాంగం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవటం లేదు. గ్రామ టీడీపీ కూడా ఈ విషయాలపై స్థానిక రెవెన్యూ అధికారులు దృష్టికి తీసుకు వచ్చినా పట్టించుకోవటం లేదు. అధికార పార్టీ నేతలకు ఉంగుటూరు రెవెన్యూ అధికారులు కూడా సహకారం అందిస్తుండటం గమనార్హం.

అవార్డులకు కృష్ణా పోలీసుల ఎంపిక

మచిలీపట్నం, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : డీజీపీ కమెండేషన్ డిస్క్ అవార్డులకు కృష్ణాజిల్లా పోలీసులు ఎంపికయ్యారు. 2022-23సంవత్సరానికి విధుల్లో అత్యుత్తమ సేవలు అందించినందుకుగాను ఈ అవార్డులకు ఎంపిక చేశారు. డీజీపీ కమెండేషన్ డిస్క్ వెండి పతకాలకు గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్, మచిలీపట్నం డీఎస్పీ మాధవరెడ్డి, గన్నవరం డీఎస్పీ జయసూర్య, అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్, మచిలీపట్నం డీఈసీఆర్‌బీ ఎస్ఐ షేక్ అలీబేగ్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ కె.శ్రీనివాసరావు, మచిలీపట్నం ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ ఎస్.ప్రకాష్‌బాబులు ఎంపికయ్యారు. మచిలీపట్నం డీఎస్పీ విజయభాస్కర్, ఏఎస్పీ సూర్యశ్రావణ్‌కుమార్, ఇనగుదురుపేట ఏఎస్ఐ టి.శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఏఎస్ఐ డి.నాగమల్లేశ్వరి, హెడ్‌కానిస్టేబుల్ కె.ధనలక్ష్మీ, మచిలీపట్నం పీసీఆర్ విభాగంలో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ పి.నాగసుశీల్‌కుమార్, ఏఆర్ కానిస్టేబుల్ పి.శివప్రసాద్, హెడ్‌కానిస్టేబుళ్లు సీహెచ్ శ్రీనివాసరావు, పి.వెంకటేశ్వరరావు, ఏఎస్ఐ వరప్రసాద్ రజత పతకాలకు ఎంపికయ్యారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.00

జిల్లాలో పది పరీక్షలకు 98.15 శాతం విద్యార్థులు హాజరు

మచిలీపట్నం టౌన్, మార్చి 27: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. జిల్లాలో 98.15 శాతం విద్యార్థులు పరీక్షలు రాశారని డీఈవో తాహెరా సుల్తానా తెలిపారు. 25,436 మంది రెగ్యులర్ విద్యార్థులకు 21,030 మంది, 1,552 మంది ప్రైవేటు విద్యార్థులకు 742 మంది హాజరయ్యారని తెలిపారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీసు జరగలేదని తెలిపారు. యూనిక్ కోడ్ కేటాయించడం వల్ల ఈ ఏడాది ప్రశ్నపత్రాలు లీకవ్వలేదన్నారు. మొదటి ఐదు ర్యాంకుల్లో జిల్లాకు ఒక ర్యాంకు వస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

ఫరీద్‌బాబా ఉరుసు ప్రారంభం

మచిలీపట్నం టౌన్, మార్చి 27: బందరు మండలం పెదకరగ్రహారంలో బుధవారం ఫరీద్‌బాబా ఉరుసు మహోత్సవాన్ని ఘనంగా ప్రారంభించారు. వివిధ ప్రాంతాలకు చెందిన బాబా భక్తులు కుల మతాలకతీతంగా హాజరయ్యారు. దీపారాధన కార్యక్రమాలు జరిగాయి.

ధాన్యం బిల్లులు చెల్లించడం లేదని
అర్తమూరు ఆర్బీకే చైర్మన్ రాజీనామా



వైసీపీకి, చైర్మన్ పదవికి రాజీనామా చేసిన కాగిత రాంబాబు

బంటుమిల్లి, మార్చి 27: కొన్ని నెలలుగా ప్రభుత్వం రైతులకు ధాన్యం బిల్లులు చెల్లించడం లేదని అందుకు నైతిక బాధ్యత వహిస్తూ తాను వైసీపీకి, అర్తమూరు ఆర్బీకే చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు కాగిత రాంబాబు విలేకరులకు తెలిపారు. బుధవారం తన రాజీనామా పత్రాన్ని ఆయన వైసీపీ మండల కన్వీనర్ సుజ్ఞానం మహేష్‌కు అందించారు. తన రాజీనామాపత్రాన్ని ఆమోదించాలని ఆయనను కోరారు. తదుపరి కార్యాచరణ త్వరలో ప్రకటిస్తానని తెలిపారు.

సాంకేతిక రంగంలో శరవేగంగా మార్పులు

- నైపుణ్యాలున్న యువతకు ఉద్యోగావకాశాలు: జేఎన్టీయూకే మాజీ వీసీ వీఎస్ఎస్ కుమార్



మాట్లాడుతున్న వీఎస్ఎస్ కుమార్

మచిలీపట్నం టౌన్, మార్చి 27: సాంకేతిక రంగంలో శరవేగంగా మార్పులు వస్తున్నాయని, నైపుణ్యాన్ని అందిపుచ్చుకుంటే యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనేక ఉద్యోగావకాశాలు లభిస్తాయని జేఎన్టీయూకే మాజీ ఉపకులపతి, జాతీయ సాంకేతిక శిక్షణ పరిశోధన సంస్థ(చెన్నై) చైర్మన్ ఆచార్య వీఎస్ఎస్‌కుమార్ తెలిపారు. బుధవారం కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యా సదస్సులో ఆయన మాట్లాడారు. దేశ విద్యార్థులకు విదేశాల్లో మంచి అవకాశాలు ఉన్నాయని కేయూ వీసీ జి.జ్ఞానమణి అన్నారు. రిజిస్ట్రార్ కె.శోభన్‌బాబు, వ్యాపారవేత్త అంకయ్య చౌదరి, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రధాన ఆచార్యుడు సుందరకృష్ణ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత పాల్గొన్నారు.

ఉమ్మడి కమిటీలకు టీడీపీ ప్రచార బాధ్యతలు

పెడన, మార్చి 27: టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో ఉమ్మడి కమిటీలను ఏర్పాటు చేసి, ఆ కమిటీలకు ఎన్నికల ప్రచార బాధ్యతలను అప్పగించాలని మూడు పార్టీల నాయకుల ఉమ్మడి సమావేశం తీర్మానించింది. పెడన పట్టణంలో కూటమి అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్‌కు మంచి మెజారిటీ తీసుకురావడానికి అనుసరించాల్సిన వ్యూహంపై పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్యనాయకుల సమావేశం బుధవారం బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు సారథ్యంలో జరిగింది. పట్టణంలోని 23 వార్డుల్లో సమన్వయ, బూత్ కమిటీలు ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. యక్కల శ్యామలయ్య, వహబ్‌ఖాన్, కమ్మగంటి బాబు, జనసేన పార్టీ నాయకులు మట్టా శివపావని, కూనపరెడ్డి రంగయ్య నాయుడు, పత్తిపాటి జయకృష్ణ, వరుదు రాము, బీజేపీ నాయకులు కట్టా జ్యోతీశ్వరరావు, మామిడి లక్ష్మీనారాయణ గుప్తా, పత్తిపాటి వెంకటరమణ పాల్గొన్నారు.

అర్చకులపై దాడి దారుణం

- వైసీపీ నేతలను కఠినంగా శిక్షించాలి: టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా కన్వీనర్ పీవీ ఫణికుమార్

పామర్రు, మార్చి 27: కాకినాడలో అర్చక స్వాములపై దాడి దారుణమని, దాడికి పాల్పడిన వైసీపీ నేత సిరియల చంద్రశేఖర్‌పై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా కన్వీనర్ పీవీ ఫణికుమార్, పామర్రు నియోజకవర్గ బ్రాహ్మణ సంఘ నేత బేతనభొట్ల సుబ్బారావు బుధవారం డిమాండ్‌చేశారు. అర్చకులకు వైసీపీ పాలనలో రక్షణ కరువైందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా అర్చకులు పురోహితులందరినీ సంఘటితం చేసి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

బటన్ నొక్కి చాలా రోజులైనా ఖాతాల్లో
డ్వాక్రా డబ్బులు పడలేదు: సీపీఎం

గుడివాడ: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి చాలా రోజులైనా, డ్వాక్రా మహిళల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని వెంటనే నగదు జమ చేయాలని సీపీఎం నాయకుడు ఆర్సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కామ్రేడ్ సుందరయ్యభవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐద్వా నాయకురాలు పి.రజిని పాల్గొన్నారు.

ఎన్డీయే కూటమికి ఓటు ప్రమాదకరం: సీపీఎం

మచిలీపట్నం టౌన్, మార్చి 27: ఎన్డీయే కూటమికి ఓటు వేస్తే ప్రమాదకరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై. వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో పార్టీ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. అదానీ, అంబానీల కోసం ప్రభుత్వ రంగ సంస్థలను బీజేపీ తాకట్టుపెట్టిందని ఆయన ఆరోపించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వైనరసింహారావు, వి.సుబ్రహ్మణ్యం, కొడాలి శర్మ మాట్లాడారు.

నేడు మంచినీటి సరఫరాలో అంతరాయం

గుడివాడ: పురపాలక సంఘ పరిధిలోని 25వ వార్డు పెద ఎరుకపాడు ప్రధాన నీటి సరఫరా కేంద్రం నుంచి జగనన్న కాలనీ, టిడ్కో గృహ సముదాయానికి ప్రత్యేకమైన పైపులైను ఏర్పాటు పనులు జరుగుతున్నందున శాంతినగర్ రిజర్వాయర్, గుడ్‌మెన్‌పేట, ఆర్టీసీ కాలనీ, బంటుమిల్లి రోడ్డు, తాలుకా రిజర్వాయర్ పరిధిలోని ప్రాంతాలకు గురువారం మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అసిస్టెంట్ కమిషనర్ టి.వి.కృష్ణారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వవార్డు నుంచి 24వ వార్డు, 30వ వార్డు నుంచి 35వ వార్డుల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

దుర్గానాగేశ్వరుని హుండీల
ఆదాయం రూ.2.38 లక్షలు

మోపిదేవి, మార్చి 27: పెదకళ్లేపల్లిలో దుర్గానాగేశ్వరస్వామికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకల ద్వారా రూ.2,38,904 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వైశ్రీనివాసరావు, ఆలయ సహాయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మంటాడ వేంకటేశ్వరస్వామి
హుండీ ఆదాయం రూ. 2.59లక్షలు

పమిడిముక్కల, మార్చి 27: మంటాడలో అలివేలు మంగా పద్మావతి సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొమ్మిది హుండీలు తెరచి లెక్కించగా 50 రోజులకు రూ. 2,59,001 ఆదాయం సమకూరిందని ఆలయ అధికారి మాధవీలత తెలిపారు.

వృద్ధాశ్రమానికి గ్రైండర్ అందజేత

మచిలీపట్నం టౌన్, మార్చి 27: స్నేహాలయ వృద్ధాశ్రమానికి ఎల్ఐసీ ఉద్యోగుల సంఘ నాయకులు బుధవారం గ్రైండర్ అందించారు. సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ జి.సుధాకర్‌బాబు, జి.కిషోర్‌కుమార్, జె.సుధాకర్, టి.చంద్రపాల్, రాజశేఖర్ పాల్గొన్నారు.

పేర్ని నాని పాలనా వైఫల్యంతోనే
బందరులో తాగునీటి సమస్య

- కూటమి మచిలీపట్నం అభ్యర్థి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం నాలుగో డివిజన్‌లో ఇంటింటికీ పర్యటిస్తున్న కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మార్చి 27: ఎమ్మెల్యే పేర్ని నాని పాలనా వైఫల్యం వల్లే నగరంలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తోందని టీడీపీ-జనసేన-బీజేపీ మచిలీపట్నం అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం మచిలీపట్నం 4వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణతో కలిసి ఆయన ఇంటింటికీ పర్యటించారు. జడ్పీ సెంటర్‌లో ఆయనకు ప్రజలు తాగునీటి సమస్యను వివరించారు. వీధుల చివర ఉండే ప్రాంతాల్లో ఇళ్లకు కుళాయిల్లో తాగునీరు సరిగా అందడంలేదని, తాగునీరు కొనాల్సి వస్తోందని తెలిపారు. కుళాయిల్లో రంగుమారిన నీరు వస్తోందని ఆయనకు వివరించారు. హెడ్ వాటర్ వర్క్స్ వద్ద జలాశయాల్లో నీటిమట్టం తక్కువగా ఉంటే ట్యాంకర్లతో రాత్రిపూట వైసీపీ నాయకులు నీరు అమ్ముకుంటున్నారని రవీంద్ర ఆరోపించారు. కాలువల్లోకి మళ్లీ నీరొచ్చేదాకా రెండు రోజులకోసారి తాగునీరు సరఫరా చేయాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. పట్టిసీమ జలాలను సద్వినియోగం చేసుకుంటే తాగునీటి సమస్య, సాగునీటి సమస్య వచ్చేది కాదన్నారు. వైసీపీకి ఎక్కడికి వెళ్లినా వ్యతిరేకత కనబడుతోందని, ఇదే ఉమ్మడి అభ్యర్థి రవీంద్ర విజయానికి సంకేతమని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ అన్నారు. జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, చిన్నం సురేష్, పీవీ ఫణికుమార్, కొరెడ్ల సుశీల, కార్పొరేటర్ పినిశెట్టి నాగఛాయాదేవి పాల్గొన్నారు. భవన నిర్మాణ కార్మికులతో కలిసి రవీంద్ర ఇసుక తట్టలు మోశారు.

జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనం



రామన్నపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కాగిత కృష్ణప్రసాద్ భార్య శిరీష

పెడన: జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని కూటమి పెడన నియోజకవర్గ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ సతీమణి శిరీష దుయ్యబట్టారు. ఆమె బుధవారం గూడూరు మండలం రామన్నపేటలో ఎన్నికల ప్రచారం చేశారు. అభివృద్ధిలో రాష్ట్రాన్ని అట్టడుగు స్థాయికి దిగజార్చిన జగన్‌ను చిత్తుచిత్తుగా ఓడించాలన్న కసితో ప్రజలు ఉన్నారన్నారు. చంద్రబాబు పవన్‌కల్యాణ్, నరేంద్ర మోదీల నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఆమె ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై కరపత్రాలను అందించారు. కాగిత కృష్ణప్రసాద్‌ను ఆదరించి ఆశీస్సులు అందచేయాలని శిరీష కోరారు. గోపీ నాగబాబు, ఎస్‌పి బేగ్, కాసగాని శ్రీనివాసరావు, సిరివెళ్ల శ్రీనివాసరావు, శాయన సోమయ్య, పోతుల రాము, కారుపర్తి శ్రీనివాసరావు, పిచ్చుక విజయ్ పాల్గొన్నారు.

కూటమి అధికారంలోకి వచ్చాక
తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

మచిలీపట్నం టౌన్: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని కొల్లు రవీంద్ర అన్నారు. బందరు మండలం ఎస్.గొల్లపాలెం శివారు సింహాచలం తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. గ్రామాల్లో రవీంద్రకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. "వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామాల్లో రోడ్లపై తట్టెడు కంకర కూడా పోయలేదు. గ్రామాలను తాగునీరు, రోడ్ల సమస్య వెంటాడుతోంది. చదువుకున్న యువత ఉపాధి అవకాశాలు లేక ఇబ్బంది పడుతున్నారు. అధికారంలోకి రాగానే తాగునీరు, నిరుద్యోగ సమస్యలు పరిష్కరిస్తాం." అని రవీంద్ర అన్నారు. జనసేన రూరల్ మండల అధ్యక్షుడు గల్లా తిమోతి, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, చిన్నాపురం సర్పంచ్ కాగిత గోపాలరావు, పలువురు తెలుగు యువత నాయకులు పర్యటించారు. తెలుగు యువత గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ, జనసేన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



టిడ్కోకాలనీలో ధర్నా చేస్తున్న కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు

టిడ్కో గృహాల రుణాలు మాఫీ చేయాలి

- టిడ్కోకాలనీ అభివృద్ధి కమిటీ డిమాండ్

గుడివాడ/గుడివాడ రూరల్: టిడ్కో గృహ లబ్ధిదారుల నుంచి వసూలు చేసిన రూ.650కోట్ల బ్యాంకు రుణాలను వెంటనే మాఫీ చేయాలని, అధికారంలోకి రాకముందు ఉచితంగా టిడ్కో ఇళ్లిస్తానన్న జగన్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని టిడ్కో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు ఆర్.సంగమ్మ డిమాండ్ చేశారు. బుధవారం మల్లాయిపాలెంలోని టిడ్కో కాలనీలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రుణమాఫీ చేయాలంటూ ధర్నా నిర్వహించారు. తొలుత సీ92 బ్లాక్ నుంచి వాటర్ ట్యాంకు వరకు ర్యాలీ చేశారు. సీపీఎం నాయకులు ఆర్సీపీ రెడ్డి, బీవీ శ్రీనివాసరావు, బి.అరుణ, దుర్గ, వి.మాధవి, ఆర్.శివరాంప్రసాద్, యమ్.నాగేశ్వరరావు, పావని, పార్వతి, నూరు న్నీసా, సలీమున్నీసా, నాగమణి, సరళ, హైమావతి, దుర్గ పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన కపిలేశ్వరపురం

పమిడిముక్కల, మార్చి 27: శివనామస్మరణ, హనుమాన్ చాలీసాలతో బుధవారం కపిలేశ్వరపురం మార్మోగింది. గ్రామానికి చెందిన తాతినేని రమేశ్ ఆధ్వర్యంలో శివలింగం ఆకృతిలో ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు చేశారు. 108 సార్లు హనుమాన్ చాలీసా, శివనామ స్మరణచేశారు. టీడీపీ పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వర్ల కుమార్‌రాజా, వీరపనేని శివరామ్, వడ్డే ప్రసాద్, జిల్లా లయన్స్‌క్లబ్ నాయకుడు తాతినేని రాంబాబు, కపిలేశ్వరపురం సెక్రటరీ తాతినేని వెంకటగంగాధరరావు పాల్గొన్నారు. విజయవాడకు చెందిన పవన్ భక్త బృందం, కేరళ పూజారి మధు నంబూద్రి పూజలు నిర్వహించారు.

నేడు బార్ అధ్యక్ష పదవికి ఎన్నికలు

- తలపడుతున్న టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు మాదివాడ, కాంగ్రెస్ పెడన నాయకుడు బూరగడ్డ



మాదివాడ నరసింహారావు



బూరగడ్డ అశోక్‌కుమార్

మచిలీపట్నం టౌన్, మార్చి 27: మచిలీపట్నం న్యాయవాదుల సంఘం ఎన్నికలు గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరగనున్నాయి. 419 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు మాదివాడ వెంకట నరసింహారావు, పెడన కాంగ్రెస్ నాయకుడు బూరగడ్డ అశోక్‌కుమార్‌ల మధ్య గట్టి పోటీ ఉంది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ముందు జరుగుతున్న మచిలీపట్నం బార్ అసోసియేషన్ ఎన్నికలు కీలకమయ్యాయి. గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిపై జనసేన అభ్యర్థి గెలిచారు. ఈ ఎన్నికల్లో టీడీపీ, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య గట్టి పోటీ ఉంది.

అప్పారి వెంకటస్వామి సేవలు మరువలేనివి

అవనిగడ్డ, మార్చి 27: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి దివంగత యూటీఎఫ్ నేత అప్పారి వెంకటస్వామి చేసిన కృషి మరువలేదని పలువురు యూటీఎఫ్ నేతలు పేర్కొన్నారు. వెంకస్వామి వర్ధంతి సందర్భంగా బుధవారం అవనిగడ్డలో యూటీఎఫ్ నేతలు సంస్మరణ సభ నిర్వహించారు. 14 ఏళ్ల సర్వీసు ఉండగానే వలంటరీ రిటైర్మెంట్ తీసుకుని ఉపాధ్యాయుల సమస్యల కోసం వెంకటస్వామి కృషి చేశారని వారు పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు ఎక్కువయ్యాని, ఈ పరిస్థితులు మారాలని వారు ఆకాంక్షించారు. ప్రభుత్వం పాఠశాలలు బలోపేతమయ్యేందుకు జీవో నెంబర్ 115ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ నేతలు కనకరావు, జీవేంద్రరావు, పి.వి.ఆంజనేయులు, సింహాద్రి శ్రీనివాసరావు, ఎ.సంధ్యారాణి, కె.శ్రీనివాసరావు, ఎస్.ఎస్.స్వామి, కొండవీటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

హైందవ ధర్మ పరిరక్షణకు ముందుకురండి

- కృష్ణభక్తులకు రాధామనోహర్ దాస్ స్వామీజీ పిలుపు



అభిభాషణం చేస్తున్న రాధామనోహర్ దాస్

మచిలీపట్నం టౌన్, మార్చి 27: హైందవ ధర్మాన్ని పరిరక్షించేందుకు కృష్ణభక్తులు ముందుకు రావాలని ఆధ్యాత్మిక తత్వవేత్త రాధామనోహర్‌దాస్ స్వామిజీ పిలుపునిచ్చారు. బలరామునిపేటలో యతిరాజ భవనం పక్కన దయాకుంబ్ ఉత్సవాల్లో భాగంగా మూడో రోజున లక్ష్మీ కల్యాణం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని మనసులో నింపుకొని ఆరాధించేవారే నిజమైన భక్తులని ఆయన పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శ్రీకర రామానుజ పాల్గొన్నారు.



బంటుమిల్లిలో పారామిలటరీ దళాలతో కవాతు



ఓటుపై అవగాహన కల్పిస్తున్న నందివాడ ఎస్ఐ చంటిబాబు

స్వేచ్ఛగా ఓటేయండి

- ఓటర్లకు పోలీసుల భరోసా

బంటుమిల్లి, మార్చి 27: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటేయాలని, అందుకు పూర్తి భరోసా కల్పిస్తామంటూ పోలీసులు, పారామిలటరీ దళాలు మండలంలో బుధవారం కవాతు నిర్వహించారు. బాసినపాడు, అర్తమూరు, బంటుమిల్లి గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ నాగేంద్రస్వామి, ఎస్సై వాసు, బంటుమిల్లి పోలీసులు పాల్గొన్నారు.

నందివాడ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా గాజులపాడు, నందివాడ, జొన్నపాడు, పొలుకొండ గ్రామాల్లో బుధవారం పోలీసులు, కేంద్ర బలగాలు కవాతు నిర్వహించారు. గ్రామాల్లోని ప్రజలు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని, ఎవరికీ భయపడవద్దని ఎస్ఐ చంటిబాబు సూచించారు. అనంతరం గ్రామస్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు.

నందమూరు పాలిటెక్నిక్ విద్యార్థులు
35 మందికి ఉద్యోగాలు

పెడన రూరల్: నందమూరు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు 35 మందికి హైదరాబాద్‌కు చెందిన రిజల్యూట్, రేడియంట్ కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చాయని కళాశాల చైర్మన్ గుడివాడ ప్రసాద్ బుధవారం తెలిపారు. కంపెనీల ప్రతినిధులు తృతీయ సంవత్సరం విద్యార్థులను ఇంటర్వ్యూ చేసి ఉద్యోగ నియామక పత్రాలను అందించారని తెలిపారు. విద్యార్థులను కార్యదర్శి తాడేపల్లి మెహర్ బాబా, కరస్పాండెంట్ కాకి కుమార్‌బాబు, దోసపాటి బాబా, తమ్మన సాయి, ప్రిన్సిపాల్ ప్రసాద్ అభినందించారు.

నందమూరులో
పొక్లెయిన్ సీజ్

పెడన రూరల్: నందమూరులో అనుమతులు లేకుండా కొత్తగా చెరువులు తవ్వుతున్నారని మాజీ సర్పంచ్ పరసా రాంబాబు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం ఆర్ఐ మణికుమార్ సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించారు. గతంలో ఉన్న చెరువుల గట్లు సరిచేసుకుంటున్నట్లు చెరువుల రైతు అధికారులకు వివరించాడు. అనుమతులు లేకుండా పొక్లెయిన్‌ను పొలాల్లోకి తెచ్చారని అధికారులు రైతుకు జరిమానా విధించారు. ప్రొక్లెయిన్‌ను సీజ్ చేశారు.

5న కుంభాభిషేకం

పెడన, మార్చి 27: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగి 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఏప్రిల్ 5న మహా కుంభాభిషేకం నిర్వహిస్తామని ఆర్యవైశ్య సంఘం తెలిపింది. ప్రత్యేక పూజలు ఏప్రిల్ 3నుంచి ప్రారంభమవుతాయని పేర్కొంది.

ధ్వజస్తంభ పనులకు భూమిపూజ

అవనిగడ్డ, మార్చి 27: గీతా మందిరంలో ఏప్రిల్ 21న ఆవిష్కరించనున్న ధ్వజస్తంభ నిర్మాణ పనులకు బుధవారం మందిర కమిటీ చైర్మన్ యర్రంశెట్టి శ్రీహరిబాబు-అరుణకుమారి దంపతులు భూమి పూజ నిర్వహించారు. తవ్వకం పనులు ప్రారంభించారు. అర్చకస్వామి దీవి నరసింహమూర్తి భూమి పూజ చేశారు. శ్రీరామానుజ - వాణికుమారి, తుంగల రవి కిషోర్ - పద్మిని దంపతులు ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు జరిపారు.



వైసీపీ నుంచి టీడీపీలోకి ముస్లింలను ఆహ్వానిస్తున్న వెనిగండ్ల రాము

ముస్లింలకు కొడాలి నాని చేసింది శూన్యం

గుడివాడ: ఇరవై ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న కొడాలి నాని ముస్లింల కోసం చేసింది శూన్యమని, మైనార్టీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా నాని మోసం చేశాడని కూటమి అభ్యర్థి వెనిగండ్ల రాము విమర్శించారు. బుధవారం ఏలూరురోడ్డులోని ప్రజావేదికలో వైసీపీకి నుంచి ముస్లిం యువత ఎండీ బిలాల్ అహ్మద్, ఎండీఈ హాజీ అహ్మద్, ఎండీ అన్సార్, ఎండీ ఇస్మాయిల్, ఎండీఈ రఫీ, షేక్ రఫీ, షేక్ కరీముల్లా, ఎండీ జిలానీల నేతృత్వంలో వెనిగండ్ల ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారందరికి కండువాలు కప్పి వెనిగండ్ల పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, షేక్ ఇబ్రహీం, దింట్యాల రాంబాబు, కొడాలి రామరాజు, షేక్ జానీ, మహ్మమద్ రఫీ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాల కరపత్రాల పంపిణీ

గుడివాడ రూరల్: రామనపూడి గ్రామంలో బుధవారం ఇంటింటికీ సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. జనసేన గుడివాడ మండలాధ్యక్షుడు ఇంటూరి గజేంద్ర, టీడీపీ నాయకులు సూరపనేని రామకృష్ణ, మసిముక్కు గోపాలకృష్ణ, భట్రాజు నాగరాజు, సూరపనేని ప్రసాద్, భట్రాజు అశోక్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారానికి అనుమతి తప్పనిసరి

పామర్రు, మార్చి 27: గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారానికి, సభలు సమావేశాలు జరుపుకొనేందుకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా పొందాలని రాజకీయ పార్టీల నేతలకు పామర్రు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.శ్రీదేవి స్పష్టంచేశారు. బుధవారం ఆమె రాజకీయనేతలతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున అభ్యర్థులు గానీ వారి తరపున ప్రచారాలు చేయాలన్నా, రోడ్డుషోలు, సభలు, సమావేశాలు, ఊరేగింపులు ర్యాలీలకు అనుమతి తీసుకోవాలన్నారు. లౌడ్ స్పీకర్లకు, స్పీకర్లతో కూడిన ప్రచార వాహనాలకు, రాజకీయ గ్రామసభల సమావేశాలకు ఫ్లెక్సీలు, బ్యానర్లు పోస్టర్లు, హోర్డింగ్‌ల ప్రదర్శన, సమావేశం జరిగే ప్రాంతాల్లో ఫ్లెక్సీలు బ్యానర్ల ఏర్పాటుకు 48గంటల ముందుగా సువిధ యాప్ ద్వారా లేదా నేరుగా దరఖాస్తు చేసుకుని, అనుమతి తీసుకోవాలని ఆమె సూచించారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని శ్రీదేవి హెచ్చరించారు.

కుష్ఠు బాధితులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

మచిలీపట్నం టౌన్, మార్చి 27: కుష్ఠు బాధితులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైద్యులు, స్వచ్ఛంద సేవాసంస్థలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ జి.గీతాబాయి సూచించారు. లెప్రా సొసైటీ, ఒరాకెల్ సంస్థ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఇద్దరు బాధితులకు ఆమె వీల్ చైర్లను అందజేశారు. స్వచ్ఛంద సేవాసంస్థలు కుష్ఠు బాధితులకు 17 వీల్ చైర్లు ఇచ్చేందుకు ముందుకు రావడం ముదావహమన్నారు. లెప్రసీ సంస్థ జేడీ డాక్టర్ దేవసాగర్, డాక్టర్ అంబటి వెంకట్రావు, నాగవాణి, మదర్ థెరెస్సా చారిటబుల్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.00

ఘనంగా నటుడు రామ్‌చరణ్ జన్మదిన వేడుకలు

కంకిపాడు, మార్చి 27 : రాష్ట్ర భవిత యువత చేతుల్లోనే ఉందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. చిరంజీవి యువత జిల్లా ఉపాధ్యక్షుడు ఏనుగ జయప్రకాష్ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ నటుడు రామ్‌చరణ్ జన్మదిన వేడుకలు విజయలక్ష్మి థియేటర్ వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హరికృష్ణ మాట్లాడుతూ, యువతకు ఉద్యోగాలు రావాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబు అవసరముందన్నారు. ఎన్నికల్లో యువత తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. అందుబాటులో ఉండే బోడె ప్రసాద్‌ను గెలిపించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పులి శ్రీనివాసరావు, గుమ్మడి కిరణ్‌కుమార్, ఏనుగ పవన్, శంకర్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి



పోలీస్ స్టేషన్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి

హనుమాన్‌జంక్షన్, మార్చి 27 : రానున్న ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల విఘాతానికి తావు ఇవ్వకుండా ప్రజలు సహకరించాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి అన్నారు. బుధవారం ఆయన హనుమాన్‌జంక్షన్ పీఎస్‌తో పాటు నూతనంగా నిర్మించిన పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఎన్నికల విధులు పోలీస్ సిబ్బంది ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గన్నవరం డీఎస్పీ జయసూర్య, ట్రైనీ డీఎస్పీ వేదశ్రీ, సీఐ నవీన్ మూర్తి, ఎస్సైలు జనార్దన్, అర్జమ్మ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



జనసేన నేత చలమలశెట్టి రమేష్‌బాబుతో చింతమనేని ప్రభాకర్

హనుమాన్‌జంక్షన్, మార్చి 27 : వైసీపీ పాలనలో కుంటుపడిన రాష్ట్రాభివృద్ధి తిరిగి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే సాధ్యం అవుతుందని మాజీ ఎమ్మెల్యే, దెందులూరు టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ అన్నారు. బుధవారం జనసేన గన్నవరం నియోజకవర్గం సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబును తన నివాసంలో చింతమనేని మర్యాద పూర్వకంగా కలిశారు. గన్నవరం, దెందులూరు నియోజక వర్గాలకు సరిహద్దు హనుమాన్‌జంక్షన్ ప్రాంతంలో చలమలశెట్టి రమేష్‌బాబు సహకారాన్ని చింతమనేని కోరారు. గన్నవరం నియోజకవర్గంతో పాటు దెందులూరు నియోజకవర్గ గ్రామాల్లో జనసేన పార్టీ కార్యకర్తల సహకారం అవసరమన్నారు. రెండు నియోజకవర్గాల్లో టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా జనసేన బాపులపాడు మండల అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు జన్మదిన వేడుకలో చింతమనేని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో దెందులూరు నియోజకవర్గం టీడీపీ నాయకులు, బాపులపాడు మండల జనసేన నాయకులు గరికపాటి నాగేశ్వరరావు, నూలు నరసింహారావు, వడ్డి రాము, వీరమహిళలు శిరీష, జయరాణి, తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం బార్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాసరామచంద్రమూర్తి



విజేతలను అభినందిస్తున్న కలపాల వెంకటరమణ

గన్నవరం(ఉంగుటూరు), మార్చి 27 : గన్నవరం బార్ ప్రెసిడెంట్‌గా న్యాయవాది గొల్లనపల్లి శ్రీనివాసరామ చంద్రమూర్తి ఎన్నికయ్యారు. బుధవారం ప్రతిష్టాత్మ కంగా జరిగిన గన్నవరం బార్ అసోసి యేషన్ ఎన్నికల్లో రెండు ప్యానళ్లు పోటీపడ్డాయి. బార్ ప్రెసిడెంట్ పదవికి పోటీచేసిన న్యాయవాది కోసూరి సుబ్రహ్మణ్యేశ్వరరావుపై శ్రీనివాస రామ చంద్రమూర్తి ఘన విజయం సాధించారు. వైస్ ప్రెసిడెంట్‌గా పోటీచేసిన తిరివీధి వెంకయ్యపై లోకం వేణుబాబు విజయం సాధించగా, జనరల్ సెక్రటరీగా పోటీచేసిన జాస్తి తాతారావుపై రామకూరి ప్రకాశరావు గెలుపొందారు. సెక్రటరీగా రాజశ్రీ శారద ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ట్రెజరర్ శీలం వెంకట సాంబశివరావుపై రామిశెట్టి విమల్ కుమార్ విజయం సాధించారు. లేడీ రిప్రజెంటేటివ్‌గా లంకా భగీరథి, ఈడే వాసవి సంయుక్త విజయం సాధించారు.

కొదమసింహాల్లా పోరాడాలి

టీడీపీ శ్రేణులకు పార్టీ నాయకులు బోడె ప్రసాద్, వెలగపూడి, అనుమోలు పిలుపు



కానూరు వెలగపూడి శంకరబాబు కార్యాలయంలో మాట్లాడుతున్న బోడె ప్రసాద్

పెనమలూరు, మార్చి 27 : వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం నియోజకవర్గ టీడీపీ శ్రేణులు కొదమ సింహాల్లా పోరాడాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్, టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు, తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు పిలుపునిచ్చారు. బుధవారం కానూరులోని వెలగపూడి శంకర బాబు కార్యాలయంలో జరిగిన మొదటి క్లస్టరు టీడీపీ శ్రేణుల సమావేశంలో వారు మాట్లాడారు. సైకో జగన్‌రెడ్డిని ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ప్రజల వద్దకు టీడీపీ శ్రేణులు వెళ్లి టీడీపీ జనసేనల ఉమ్మడి మేనిఫెస్టోలోని అంశాలను వివరించి తద్వారా ఒక్కో ఇంటికి చేకూరే లబ్ధిని వివరించాలని కోరారు. పార్టీలో అసంతృప్తులు ఎవరయినా ఉంటే సమాచారాన్ని వెంటనే తమకు తెలపాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ బుజ్జి, చలసాని రాము, సంగెపు రంగారావు, పీతా గోపీచంద్, శొంఠి శివరాంప్రసాద్, షేక్ ఇమాం, శ్రీహరి, మధు, రామకృష్ణ, కొంద్రు కోటేశ్వరరావు, కోసూరి రమేష్, సుంకర సాయి, చైతన్య, ఇక్బాల్, బూత్ కన్వీనర్లు, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

ఆకునూరులో వైసీపీ నుంచి టీడీపీలోకి..

ఆకునూరు(ఉయ్యూరు) : వైసీపీ పాలనలో బడుగు, బలహీన వర్గాలకు మేలు జరుగకపోగా పెచ్చుమీరిపోయిన దాడులు, అరాచకాలతో విసిగిపోయి వైసీపీనుంచి టీడీపీలో చేరేందుకు అనేకమంది ముందుకు వస్తున్నారని టీడీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బోడె ప్రసాద్ అన్నారు. ఆకునూరులో వైసీపీకి చెందిన పలువురు టీడీపీలో చేరగా వారికి కండువా కప్పి బోడె ప్రసాద్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

● ఆకునూరులో పార్టీ కారాల్యయాన్ని బోడె ప్రసాద్ పార్టీ నాయకులతో కలసి ప్రారంభించారు. పార్టీ మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, సర్పంచ్ వసంతకుమార్, వెలగపూడి వెంకన్న, కాకాని శ్రీనివాసరావు, పొట్లూరి మురళి, వరప్రసాద్, తాతబ్బాయి, కొండా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై కేసు కొట్టివేత

పెనమలూరు : పంట కాల్వ రోడ్డును పూర్తి చేయాలంటూ 2020లో ధర్నా చేస్తున్న టీడీపీ నాయకులపై పెనమలూరు పోలీసులు నమోదు చేసిన కేసును బుధవారం విజయవాడ న్యాయమూర్తి కొట్టివేశారు. సేకరించిన సమాచారం మేరకు.. 2020జూన్‌లో మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో కలిసి టీడీపీ నాయకులు పంట కాల్వ రోడ్డును పూర్తి చేయాలంటూ ధర్నా నిర్వహించారు. కొవిడ్ ఆంక్షల నేపథ్యంలో పోలీసు యాక్ట్30, 144 సెక్షన్‌ల కింద పోలీసులు బోడె ప్రసాద్‌తో పాటు మరో పదకొండు మంది టీడీపీ నాయకులపై కేసు నమోదు చేశారు. నాలుగేళ్ల అనంతరం బుధవారం సరైన సాక్ష్యాలు లేని కారణంగా కేసును కొట్టి వేస్తున్నట్లు న్యాయమూర్తి తెలిపారు. కేసులో అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, బొగ్గవరపు శ్రీనివాస్, వడ్లమూడి శుభశేఖర్, తుమ్మల రాంకుమార్, యార్లగడ్డ చక్రవర్తి, కోలా ప్రసాద్, సుబ్బారావు, ప్రవీణ్ ఉన్నారు. నిందితుల తరఫున సుంకర సురేష్ వాదనలు వినిపించారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ గీతాబాయి



ఇందుపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీఎం అండ్ హెచ్‌వో

ఉంగుటూరు, మార్చి 27 : వివిధ ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారిణి (డీఎంఅండ్ హెచ్‌ఓ) డాక్టర్ జి.గీతాబాయి అన్నారు. మండలంలోని ఇందుపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని (పీహెచ్‌సీ) బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి రిజిస్టర్‌లు, రికార్డులను పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. ఆస్పత్రిలోని స్టోర్ రూమ్. డెలివరీ రూమ్‌లను పరిశీలించి, పీహెచ్‌సీలో డెలివరీలు జరిగేలా చూడాలని వైద్యాధికారులకు సూచించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలు, సిబ్బంది సమయపాలన గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో వున్న మందుల వివరాలు, చేపడుతున్న కార్యక్రమాల గురించి సిబ్బందిని ఆరాతీశారు. వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో వుంటూ, అత్యవసర సమయాల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలందిస్తూ, వారితో స్నేహపూర్వకంగా మెలగటంద్వారా ప్రజల మన్ననలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ బి.శిరీష, డాక్టర్ వీవీ సుబ్బారావు, ఎంపీహెచ్‌ఈవో కె.సత్యనారాయణ, ఎస్‌యువో వెంకటరాజు, ఎంపీహెచ్‌ఎస్‌లు జయలక్ష్మి, ఇమ్మానియేలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చిన ఓగిరాల పీహెచ్‌సీలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

చినఓగిరాల(ఉయ్యూరు) : చిన ఓగిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నట్టు ఆరోగ్య కేంద్ర అధికారి బి ఇంద్రావతి తెలిపారు. బుధవారం ఒక్కరోజే ఆరు ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేయగా ఇంతకు ముందు ఒక వేసెక్టమి, ఒక ట్యూబెక్టమీ ఆపరేషన్ చేశామని, మహిళలు ఏవిధమైన భయాందోళనకు గురికాకుండా కుటుంబ నియంత్రణకు ఆపరేషన్లు ఏవిధమైన ఖర్చులేకుండా ఉచితంగా చేయించుకుని ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందుకోవాలని పేర్కొన్నారు.

రికార్డు స్థాయిలో ఆశీలపాట

●రూ.16.90 లక్షలకు చేరిన పాట ● గత ఏడాది కంటే రెట్టింపు

ఉయ్యూరు, మార్చి 27 : ఉయ్యూరు నగర పంచాయతీలో రోజువారీ ఆశీల పాట రికార్డు స్థాయిలో రూ.16.90లక్షలు పలికింది. పట్టణంలో రోజువారీ ఆశీలు వసూలు చేసుకునేందుకు బుధవారం నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటలో ముగ్గురు పోటీపడి గత ఏడాది కంటే 120 శాతం వరకు పెచ్చుమొత్తానికి పాడుకోగా నగర పంచాయతీకి పెద్దమొత్తంలో ఆదాయం లభించింది. 2021 - 2022లో రూ. 3,91,000, 2022- 2023లో రూ.4,05,000, 2023-2024లో రూ. 8,47,000 కాగా ప్రస్తుత సంవత్సరం రూ. 16.90లక్షలు రావడం విశేషం. జంపాన బసవశంకర్ ఆ మొత్తానికి వేలంపాట లో దక్కించుకున్నాడు. కోవిడ్-19 తరువాత రెండు సంవత్సరాలు నియోజకవర్గ అధికార పార్టీ ముఖ్య ప్రజాప్రతినిధి అండతో వైసీపీకి చెందిన ఆయన అనుచరుడు తూతూ మంత్రంగా వేలంపాట పెట్టించి తక్కువ మొత్తానికి దక్కించుకున్నాడు. గత సంవత్సరం కూడా అదే విధంగా తక్కువ మొత్తంలో ఆశీలు పాట దక్కించు కునేందుకు ప్రయత్నించాడు. ఈ సారి వేలం పాటలో టీడీపీకి చెందిన ఓ వ్యక్తి పోటీకి వచ్చి రూ.8.46 లక్షలకు పాట దక్కించుకోగా ముఖ్య ప్రజాప్రతినిధి ఒత్తిడితో దానిని రద్దు చేయించి తిరిగి రూ. 8,47,000కు ఆయన అనుచరుడు చేజిక్కించుకుని లక్షలాది రూపాయలు ఆదాయానికి గండికొట్టి లబ్ధిపొందడం గమనించదగ్గ విషయం. పోలీసుల బందోబస్తు నడుమ ఆశీలపాట నిర్వహించడం విశేషం.

ప్రజాస్వామ్యంలో ఓటు బలమైన ఆయుధం



మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న రేమల్లె హైస్కూల్ ఉపాధ్యాయులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 27 : ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజా స్వామ్యదేశమైన భారతావనిలో సామాన్యుడికి ఓటే బలమైన ఆయుధమని ఎంఈవో సురేష్‌కుమార్ అన్నారు. రేమల్లె హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం దారపురెడ్డి భాస్కరరావు పర్యవేక్షణలో బుధవారం విద్యార్థులతో మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెలమర్తి రవిబాబు, రాజేష్, వెంకటకుమారి, పద్మ, తదితర ఉపాధ్యాయులు పాల్గొని పర్యవేక్షించారు.

ఆన్‌లైన్ యాప్ ద్వారా రూ.30 లక్షలకు టోకరా

పెనమలూరు, మార్చి 27 : ఆన్‌లైన్ యాప్‌లో విడతలవారీగా పెట్టుబడులు పెట్టి ముప్పై లక్షల మోసపోయిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పోరంకి గ్రామానికి చెందిన వంగూరు మణికుమార్ చెన్నైలోని ఒక కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. ఇంటి వద్దనే ఉంటూ వర్క్ ఫ్రం హోమ్ ద్వారా ఉద్యోగం చేస్తున్నాడు. గత నెల 23న వాట్సాప్ గ్రూప్‌లో వచ్చిన లింక్ ఓపెన్ చేసి పెట్టుబడి పెట్టడం ప్రారంభించాడు. విడతల వారీగా ఈ నెల 19 వరకు షుమారు 17లక్షలను పెట్టుబడగా పెట్టాడు. తాను ఇన్‌వెస్టు చేసిన మొత్తానికి లాభంతో కలిపి ముప్పై లక్షలను డ్రా చేద్దామని ప్రయత్నించగా 5శాతం సర్వీస్ ట్యాక్సును కట్టించుకొని విత్‌డ్రా చేయనియ్యకుండా డబ్బులు లాగేసుకొన్నారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన మణికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సుందరమ్మ పేటలో శంఖారావం



పెదఓగిరాల శంఖారావంలో బోడె వెంకట్రామ్, మనోజ్

ఉయ్యూరు, మార్చి 27 : ఉయ్యూరు సుందరమ్మపేటలో టీడీపీ నాయకులు బుధవారం శంఖారావం నిర్వహించి, చంద్రబాబు ప్రకటించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు వివరించారు. 13వ వార్డు నాయకుడు మీసాల అప్పల నాయుడు ఆధ్వర్యంలో పలువురు పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని వైసీపీ అవినీతి, అరాచక పాలనను ప్రజలకు వివరించి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత అమలు చేసే సంక్షేమ పథకాలు తెలియజేశారు. ● పెదఓగిరాలలో బోడె వెంకట్రామ్, మనోజ్ శంఖారావం కార్యక్రమం నిర్వహించి తెలుగుదేశం పార్టీకి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రకటించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పార్టీ నాయకులు రంగారావు, పోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రూ.15వేల వేతనం ఇవ్వాలి

గండిగుంట(ఉయ్యూరు), మార్చి 27 : గండిగుంట గ్రామ సచివాలయ పరిధిలో పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం నెలకు రూ. 15వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బి రాజేశ్ డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మి కులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవా రం గ్రామ సచివాలయం వద్ద కొద్దిసేపు కార్మికులు ధర్నా చేసి అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చాలీ చాలని వేతనాలతో పారిశుధ్యం పనులు చేస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచు తున్నారని, ప్రాణాలు సైతం లెక్కచేయక పనులు చేస్తుంటే టెండర్ ఏజెన్సీ ద్వారా కేవలం రూ. 6 వేలు వేతనం చెల్లించడం దుర్మార్గమన్నారు. జీవో నంబరు ఒకటి ప్రకారం కనీస వేతనం రూ. 15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచా యతీ వర్కర్స్ యూనియన్ నాయకులు రంగమ్మ, శ్రీను, చెల్లయ్య, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఉత్తమ అధికారిగా శ్రీహరిబాబు

ఉంగుటూరు, మార్చి 27 : జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ఉత్తమ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్ వి.శ్రీహరిబాబు ఎంపికయ్యారు. మంగళవారం జేఎన్‌టీయుకే వైస్ చాన్సలర్ ప్రసాద్‌రాజు చేతులమీదుగా ఆయన ఉత్తమ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పురస్కారాన్ని అందుకున్నారు. బుధవారం స్థానిక కళాశాలలో అభినందనసభ నిర్వహించారు. ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ జేఎన్‌టీయూ కాకినాడ, పరిధిలోని 108 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి మొత్తం నలుగురిని ఎన్‌ఎస్‌ఎస్ ఉత్తమ ప్రోగ్రామ్ ఆఫీసర్ పురస్కారాలకు ఎంపికచేయగా, తమ కళాశాలకు చెందిన శ్రీహరిబాబు వారిలో ఒకరు కావటం హర్షణీయమన్నారు.

తేలప్రోలులో కోదండ రామాలయ పునఃప్రతిష్ఠ

ఉంగుటూరు, మార్చి 27 : తేలప్రోలు పార్సన్స్‌పేటలోని శ్రీకోదండ రామాలయం పునఃప్రతిష్ఠామహోత్సవాల్లో భాగంగా బుధవారం నూతన ఆలయ విగ్రహ, శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. టీటీడీ ఆస్థాన సిద్ధాంతి బ్రహ్మశ్రీ తంగిరాల వెంకటకృష్ణ పూర్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి ఆలయంలో జరుగుతున్న ప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం గం.8.13ని.లకు యంత్రస్థాపన, శ్రీవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులోభాగంగా శ్రీసీతారా మాంజనేయ స్వామివార్లకు వేదమంత్రాలతో అగ్నిహోమాలు, పూర్ణకుంభాభిషే కాలు, విశేష అర్చనలు నిర్వహించి, మహాపూర్ణాహుతిని సమర్పించారు.

రామేశ్వరస్వామి ఆలయ భూముల వేలం రేపు

ఉయ్యూరు, మార్చి 27 : బోళ్లపాడు శ్రీరామేశ్వరస్వామి ఆలయానికి చెందిన 4.92 ఎకారాల మాగాణి భూమికి కౌలుకు సంబంధించి 2024-2025 నుంచి 2026-2027 మూడేళ్లకుగాను శుక్రవారం ఉదయం దేవాలయం ఆవరణలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్టు ఆలయ అధికారి మాధవీలత తెలిపారు. అలాగే కాటూరు భీమలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన మూడు షాపులు అద్దెకు సంబంధిచి 2024- 2025 నుంచి 2026- 2027 వరకు మూడేళ్లకుగాను శుక్రవారం మధ్యాహ్నం ఆలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు తెలిపారు.